Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 07.09.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# నెగ్గితే నారా.. తగ్గితే తారక

## ➤ త్వరలోనే తెలుగు రాజకీయ తెరపై నారా వర్సెస్ నందమూరి పోరు

***2019 ఎన్నికలు...*** అధికార తెలుగుదేశంకు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌కు ఫైనల్ మ్యాచ్‌లాంటి ఎన్నికలు! ఒకరకంగా చెప్పాలంటే ఈ ఎన్నికల్లో అధికారం చేజిక్కించుకోవడం వైసిపికి ఎంతో అవసరం. అధికారంలోకి వస్తేనే ఆ పార్టీ నిలబడగలదు. అధికారంలోకి రాలేకపోతే మాత్రం మరో ఐదేళ్ళు ప్రతిపక్ష పాత్రలో మనుగడ సాగించడం కష్టమే! వైసిపి అధికారంలోకి వచ్చినా రాకపోయినా దాని నాయకుడు మాత్రం జగన్మోహన్‌రెడ్డే!



ఇద్దరు యువనేతల భవిష్యత్ తేల్చనున్న 2019 ఎన్నికలు

## ➤ వారసత్వ రేస్‌తో వేడెక్కనున్న తెలుగుదేశం రాజకీయాలు

అయితే 2019 ఎన్నికలు ఇంకో యువనాయకుడి రాజకీయ భవిష్యత్‌ను కూడా నిర్దేశించనున్నాయి. ఆయనే మన ఐటి మంత్రి నారా లోకేష్. చంద్రబాబు పుత్రరత్నం. లోకేష్‌కు సొంతంగా పార్టీని నడిపే సత్తా లేదు. ఎన్నికలను ఎదుర్కొనే సామర్థ్యం లేదు. చంద్రబాబు నీడలో నాయకుడిగా ఎదగాల్సిందే! రాజకీయంగా ఆయన వేసిన తొలి అడుగే దొడ్డిదారిలో పడింది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజాక్షేత్రంలో తన సామర్థ్యం చూపించుకోకుండా గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడై తండ్రి కేబినెట్‌లో మంత్రి బెర్త్ దక్కించుకున్నాడు. చంద్రబాబు తర్వాత పార్టీని హ్యాండిల్ చేయగల శక్తి లోకేష్‌కు లేదని పార్టీ కేడర్‌కు అర్థమైంది. అయితే లోకేష్‌ను తన రాజకీయ వారసుడిగా చూసుకోవాలన్నది చంద్రబాబు కోరిక! (మిగతా 11వ పేజీలో)



# పాపానికి.. ప్రాయశ్చిత్తమా?

## వైకాపాలోకి ఆనం.. ఆదరించేనా జనం!


దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని చంద్రబాబు విమర్శించొచ్చు, ఎర్రన్నాయుడు, పత్తిపాటి పుల్లారావు, గాల్లపాటి రామ్మోహన్ రావు, కేశినేని నాని, దేవినేని ఉమ... ప్రత్యర్థి పార్టీలోని వీళ్లే కాదు కాంగ్రెస్ పార్టీలో వున్న వి. హెచ్.హనుమంతురావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, మధు యాష్కీ... ఇలాంటివాళ్ళు విమర్శించినా అర్థముంది. (మిగతా 11వ పేజీలో)



పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
వినాయకచవితి శుభాకాంక్షలు
సం/-

## మొదలైన బాబు

# ఎలక్షన్ యాక్షన్



- ఓటర్లకు తాయిలాలు
- ఎడాపెడా వరాలు

భారతీయ సాంస్కృతిక చరిత్రలో *64* కళలుంటాయి. మన దేశంలో ఎన్నికల వ్యవస్థ మొదలు కాకముందు *64*కళలనే తేల్చారు. ఇప్పుడు ఎన్నికల నిర్వహణను *65*వ కళగా చేర్చవచ్చు. ఈ *65*వ కళలో ఆరితేరిన వాడే నారా చంద్రబాబునాయుడు.

ఎలక్షన్ అన్నది ఒక ఆట. ఇందులో బాగా ఆడి నెగ్గుకురావడం అన్నది ఒక కళ. ఈ కళలో రాటుదేలిన ఆటగాడు చంద్రబాబునాయుడు. ఈ ఆటలో లూప్‌హోల్స్ అన్నీ ఆయనకు బాగా తెలుసు. ఎన్నికల ఆటను ధాటిగా కాదు, టెక్నికల్‌గా ఆడుతాడు. తాను కెప్టెన్ అయినప్పటికి తనకంటే మెరుగైన ఆటగాడు (మిగతా 11వ పేజీలో)



## జాతీయ స్థాయి ప్రతిష్ట సాధించిన

# పల్లెటూరి పాఠశాల

ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి గ్రామం... చాలా చిన్న పల్లెటూరు. అయితేనేం... జాతీయ స్థాయిలో వినుతికెక్కింది. ఆ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వరుసగా రెండోసారి జాతీయస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలోనూ స్వచ్ఛ విద్యాలయాలలో రెండో స్థానంలో నిలిచిన ఈ పాఠశాల జాతీయ స్థాయిలోనూ రెండోస్థానాన్ని పొందడం విశేషం. స్వచ్ఛ విద్యాలయ పురస్కారానికి ఎంపిక చేసిన ఐదు విభాగాలలోనూ ఉత్తమ ప్రమాణాలు చాటినందుకుగాను ఈ పాఠశాల ఈ పురస్కారానికి ఎంపికైంది. ఈ నెల 18వతేదీన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఉపాధ్యాయుల కృషి, స్థానిక దాతల చొరవతోనే ఈ పాఠశాలకు జాతీయ స్థాయి పురస్కారం దక్కడం విశేషం!

# స్వచ్ఛ నెల్లూరా.. చెత్త నెల్లూరా?



పారిశుద్ధ్య కార్మికులు చూస్తే సమ్మెలో వున్నారు. పాలకులు చూస్తే రాజకీయాలలో వున్నారు. ప్రజలేమో చెత్తదిబ్బల మధ్య వుంటున్నారు. స్వచ్ఛ నెల్లూరు కాదిది చెత్త నెల్లూరు... ఈ చెత్తను ఎవరూ ఎత్తకపోయినా మా ఏరియాలో మేమే ఎత్తుకుంటామంటూ వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బెజవాడ మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు 33వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ప్రజలతో కలిసి ఆయన చెత్తను ఎత్తి కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మేఘనాథ్ మాట్లాడుతూ 297 జి.ఓ ద్వారా పారిశుద్ధ్య కార్మికుల పొట్ట కొట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, పారిశుద్ధ్య కార్మికుల బాధలను అర్థం చేసుకోలేని చంద్రబాబు ప్రభుత్వాన్ని చెత్తలో కలిపే సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నాడు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్తార్, హజరత్ నాయుడు, అజీజ్, ప్రభాకర్, రాము, అజయ్‌సింగ్, నాగరాజు, ముజఫర్, శివ, మోష, షరీఫ్, తాహిర్, ఇమ్రాన్, గని, సాయికుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

గూడూరు పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన జన్మదినం సందర్భంగా ఈనెల 2న గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో పలువురు కౌన్సిలర్లు, తెలుగుదేశం పార్టీనాయకుల ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తొలుత ఛైర్‌పర్సన్ నివాసంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బాలిబోయిన రమేష్ మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్న ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత పదవులందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బి.భారతి, కల్పన, తెలుగుదేశం పార్టీ నాయకులు కోదండయ్య, శ్రీధర్, కోటి, వనిత తదితరులు పాల్గొన్నారు.


## అనురాగమూర్తికి ప్రథమ వర్ధంతి



శ్రీకంటి నాగరాజరావు గారు
ఆడిటర్, గూడూరు.

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన అమృతమూర్తి
**శ్రీకంటి నాగరాజరావు** గారు
దైవసన్నిధికి చేరి ఏడాది గడిచినా వారి జ్ఞాపకాలు
మా మదిలో చిరస్థాయిగా నిలిచే వుంటాయి.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య - మాలతి
కుమారుడు - ఎస్.వి.మనోజ్‌కుమార్
కుమార్తె - అల్లుడు
ఎస్.వి.మహేశ్వరి - మల్లిఖార్జునరావు

తమ్ముళ్ళు - మరదళ్ళు
శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి
శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ

చెల్లెళ్లు - బావలు
కారుమంచి ఇందిర - అనంతపద్మనాభరావు
యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు
మద్దాలి వసుప్రధ - వెంకటకృష్ణారావు

సంవత్సరీకం సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో జరుగును. 21వ తేదీ రుద్రాభిషేకం, గూడూరు మాలవ్యానగర్‌లోని వారి స్వగృహము నందు. కావున తెలియజేయడమైనది.


## కమీషన్ల కోసం...

# కార్మికులను రోడ్డున పడేయొద్దు

### - ఎమ్మెల్యే అనిల్



నెల్లూరు నగరంలో పారిశుద్ధ్య కార్మికులు గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ఇంతవరకు మున్సిపల్ మంత్రి నారాయణ వారిని పిలిచి సమస్యలపై చర్చించకపోవడం సిగ్గుచేటని నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో దాదాపు 400 కోట్లకు కాంట్రాక్ట్ ఇవ్వడమే జిఓ నం.279ని తీసుకురావడానికి కారణమని, దాంతో వచ్చే 10 శాతం కమీషన్ కోసం వేలాదిమంది కార్మికులను రోడ్డున పడేయడమే కాకుండా లక్షలాదిమంది ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మంచిపద్ధతి కాదని ఆయన అన్నారు. కార్మికులు సమ్మె చేస్తున్నా ఇంతవరకు అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే చర్చించాలన్నారు. నెల్లూరు నగరమంతా చెత్తాచెదారాలతో నిండిపోతున్నా, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మొండివైఖరితో ప్రవర్తించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నెల్లూరు నగరాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నామంటున్న మంత్రి నారాయణ, టిడిపి నాయకులు ఒకసారి నగర రోడ్లలో తిరిగితే పరిస్థితి అర్థమవుతుందన్నారు. ఇకనైనా జిఓ నంబరు 279ని రద్దు చేసి కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఓబిలి రవిచంద్ర, నాయకులు తుంగా ఇందూధర్‌రెడ్డి, ఎస్.నారాయణరెడ్డి, రఫీ, నాగభూషణం, దశరథరామిరెడ్డి, కొండయ్యనాయుడు, సునీల్, వెంకటేశ్వర్లు, సందీప్, తంబి, బత్తా కోటేశ్వరరావు, రాములు, తేజ, వంశీ, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నాగరాజు, మద్దినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# ఐఏబి సమావేశం పెట్టండి

సోమశిలలో పాతిక టిఎంసిల నీళ్ళు చేరిన దృష్ట్యా వెంటనే జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాన్ని నిర్వహించి, డెల్టాలో తొలి పంటకు నీరిచ్చే అవకాశాలను పరిశీలించాలని కోరుతూ జిల్లా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.గోవిందరెడ్డి, ఎన్.నిరంజన్‌రెడ్డి, టి.పురంధర్‌రెడ్డి తదితరులు 4వ తేదీ నెల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్.ఇ. ప్రసాదరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది రెండో పంట లేనందున కాలువలన్నీ పూడిపోయాయని, వెంటనే పూడిక తీత పనులు చేపట్టాలని ఆ వినతిపత్రంలో కోరారు.

# ఒత్తిళ్ళు లెక్కచేయని ఎస్ఐ

- తాగుబోతులపై కేసులు

పోలీసు అధికారులు గట్టిగా నిలబడితే రాజకీయ నాయకులైనా, ప్రజాప్రతినిధులైనా తోక ముడవాల్సిందే! 3వ తేదీ ఇలాంటి సంఘటనే సూళ్లూరుపేటలో చోటుచేసుకుంది. సూళ్లూరుపేటలోని హోలీ క్రాస్ వద్ద ఎస్.ఐ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ఆ రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు మొదలుపెట్టారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా జరిపిన పరీక్షలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కొందరు పట్టుబడ్డారు. వెంటనే వాళ్ళు తమకు తెలిసిన నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఫోన్‌లు చేసి తాము తాగి బండ్లు నడుపుతూ ఎస్ఐకి పట్టుబడ్డ విషయం చెప్పారు. వాళ్ళు ఎస్ఐకు ఫోన్ చేసి పొరపాటు చేసారని, ఇంకోసారి ఇలా చేయరని, కేసులు పెట్టకుండా విడిపించాలని కోరారు. వాళ్ళ ఒత్తిడికి ఎస్ఐ లొంగలేదు. తాగి బండ్లు నడిపి ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యులు... ఈ విషయంలో స్ట్రిక్ట్‌గా వుంటున్నా... ఎవరేమీ అనుకోవద్దంటూ తాగి బండ్లు నడిపిన అందరి పైనా కేసులు పెట్టేసాడు.

# రెడ్‌క్రాస్ వ్యాసరచన పోటీలు

మద్యం, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 16న అన్ని జిల్లాల్లోని జిల్లా కేంద్రాల్లో ఆ మేరకు 14 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలు, యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించనుంది. 'సే నో టు ఆల్కహాల్ అండ్ డ్రగ్స్' అనే అంశంతో ఈ పోటీలుంటాయని, రాష్ట్రస్థాయి విజేతలకు ప్రథమ స్థానానికి 10వేలు, ద్వితీయస్థానానికి 6వేలు, తృతీయస్థానం సాధించినవారికి 3వేలు బహుమతిగా అందించనున్నామని రెడ్‌క్రాస్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎస్.బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల్గొనేవారు 2018 ఆగస్టు 31 నాటికి 14 నుంచి 18 ఏళ్ళలోపు వారై ఉండాలని పేర్కొన్నారు.

# పార్లపల్లిలో నవగ్రహ ప్రతిష్ట

విడవలూరు మండలంలోని పార్లపల్లి గ్రామంలో వెలసివున్న శ్రీ కామాక్షిదేవి సమేత కైలాసనాథస్వామి దేవాలయంలో ఈనెల 1న నవగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నవగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రతిష్టా కార్యక్రమాలకు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితులకు విరాళం

కేరళ వరద బాధితులకు సహాయార్థం ఇటీవల ముత్తుకూరు మండల నాయకులు రూ.లక్ష విరాళంగా సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును కాకాణి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వెంట ప్రజాసంకల్ప యాత్రలో ఉన్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లా వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఈ నెల 4న కలిసి అందజేసి కేరళ బాధితులకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

# 8న గుర్రం జాషువా గ్రంథాలయం ప్రారంభం

మహాకవి, పద్మభూషణ్ గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయాన్ని ఈ నెల 8న ప్రారంభించనున్నట్లు జాషువా కవితా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు కిరణశ్రీ తెలియజేశారు. ఈ నెల 2న నెల్లూరు మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని సుంకు చెంగన్న నగరపాలక పాఠశాల వద్ద గల గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి నారాయణ, మాజీ మంత్రి మాణిక్య వరప్రసాద్ తదితర ప్రముఖులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాషువా కవితాపీఠం ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధరబాబు, కార్యదర్శి బత్తిపూడి శీనయ్య, కోశాధికారి కుమ్మర కృష్ణయ్య, ప్రచార కార్యదర్శి రాచపాళెం రఘు తదితరులు పాల్గొన్నారు.

### ఉరి తీయమన్నవారే..

# వైసిపిలో చేరారు

ఎమ్మెల్సీ బీద



అవినీతి జగన్‌ను ఉరితీసినా తప్పులేదని పలికిన ఆనం రామనారాయణరెడ్డే చివరికి ఆయన పార్టీలో చేరడం విడ్డూరంగా వుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర విమర్శించారు. 3వ తేదీ నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మంత్రిగా వున్నప్పుడు జగన్‌ను ఉరితీయాలన్న పెద్దమనిషే ఇప్పుడు ఆయన పక్కలో చేరి చంద్రబాబుపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. దోపిడీదారుల గుంపులో ఆనం రామనారాయణరెడ్డి కూడా కలిసిపోయాడని, వీళ్ళందరూ కలిసినా 2019లో తెలుగుదేశం గెలుపును అడ్డుకోలేరని అన్నారు. కొన్ని నెలల క్రితం రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మాట్లాడిన ఆనం, ఇంతకొద్ది కాలంలోనే నాలుక ఎలా మడతపెట్టాడని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రత్యేకహోదా కోసం మేం ఎన్డీఏ నుండి బయటకొచ్చాం. బీజేపీ వ్యతిరేక పార్టీలను కలుపుకుని కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. అంతేగాని వైసిపిలా తాము బయట ఒక రాజకీయం, లోపల ఒక రాజకీయం చేయడం లేదన్నారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య మాట్లాడుతూ ఆనం కుటుంబం రాజకీయంగా కష్టాల్లో వున్నప్పుడు తెలుగుదేశం ఆదుకుందని, కాని అవసరం తీరాక ఆనం వాళ్ళే తెలుగుదేశాన్ని వదిలేసిపోయారని ఆరోపించారు. పార్టీలో సీనియర్లను కాదని ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి ఆయన ఇచ్చే బహుమానం ఇదా అని ఆనంను శీనయ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, నాయకులు జి.కన్నబాబు, బి.మనోహర్‌రెడ్డి, మొయినుద్దీన్‌లు పాల్గొన్నారు.

# విశ్వసాయిలో గురుపూజోత్సవం



నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న విశ్వసాయి జూనియర్ కళాశాలలో ఈ నెల 5న గురుపూజోత్సవం జరిగింది. కళాశాల డైరెక్టర్లు డా.ఎన్ సత్యనారాయణ, జి. కృష్ణమోహన్‌లు ఈ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, గురువుల విశిష్టతను, వారి ఔన్నత్యాన్ని వివరించారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయులను వారు ఈ సందర్భంగా గుర్తుచేస్తూ అలాంటి గురువులు సాక్షాత్తూ దైవస్వరూపులని అన్నారు. ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించి అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అధిష్టించిన మహోన్నతమైన వ్యక్తి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం మనకే కాదు..భారతావనికే గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీకి

# టి.వి.రమణారెడ్డి స్మారక అవార్డు

కళాంజలి సాంస్కృతిక సంస్థ, కళాంజలి కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీ సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో జరిగే కార్యక్రమంలో ప్రముఖ సినీ హాస్య నటులు పృధ్వీరాజ్(థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ)కి సినీ హాస్య చక్రవర్తి టి.వి.రమణారెడ్డి స్మారక అవార్డును ప్రదానం చేయనున్నారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగాను, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, జిఎస్‌టి జాయింట్ కమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డి, మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి ఆత్మీయ అతిథులుగాను పాల్గొననున్నారు. కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో పాటలు, నృత్యాలు, హాస్యవల్లరిలతో ప్రేక్షకులను అలరించనున్నారు.

# ఆత్మకూరు అభివృద్ధికి అంకితమవుతాం

\- ఆదాల

ఆత్మకూరులో వంద కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీమంత్రి, ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ ఆయన ఆత్మకూరులో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదాల మాట్లాడుతూ ఆత్మకూరును అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఆత్మకూరులో 1056 ప్లాట్లతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నామని, ఒకటిన్నర నెల తర్వాత వాటిని లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే స్థలాలు వుండి ఇళ్లు కట్టుకోవాలనే పేదలకు 450 ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్లు, ఇతర పనులకు 30కోట్లు మంజూరయ్యాయని, వీటికి వారం రోజుల్లో టెండర్లు పిలుస్తారని చెప్పారు. ఆత్మకూరుకు మరో 37కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణలు అంగీకరించారని, ఆత్మకూరులో పార్కులను కూడా నిర్మించి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఈ సందర్భంగా ఆయన ఆత్మకూరులో నిర్మిస్తున్న గృహ సముదాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా డైరెక్టర్ ఖాజావలి, టీడీపీ నాయకులు టి.గిరి నాయుడు, స్వర్ణ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



గృహ సముదాయాలను పరిశీలిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# ఎన్‌బికెఆర్‌తో రెథాట్ అకాడమీ ఒప్పందం



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలతో అమెరికాకు చెందిన రెథాట్ అకాడమీవారు ఇటీవల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. రెథాట్ అనేది ఒక ఓపన్‌సోర్స్ కంపెనీ అని, దీని ద్వారా విద్యార్థులు నెట్‌వర్కింగ్ నేర్చుకోవచ్చని ఆ సంస్థ నిర్వాహకులు తెలిపారు. బెంగుళూరు నుంచి విచ్చేసిన ఆ కంపెనీ సిఇఓ మణివర్ధన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, ఈ సర్టిఫికెట్‌తో ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కళాశాల సంచాలకులు డా. వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఇటీవల ఇలాంటి అవగాహనా ఒప్పందాలు పలు కంపెనీలతో జరిగాయని, ఇప్పుడు రెథాట్ అకాడమీతో అవగాహన కుదరడం సంతోషదాయకమన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి మారుతి పెరుమాళ్ మాట్లాడుతూ కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులకు ఈ ఒప్పందం ఎంతో ఉపయోగమన్నారు. ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్.కిషోర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.




## 'ప్రభా'తం

# మోడీ... ముంచుతాడా? తేలుస్తాడా?

అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, ఇంగ్లాండ్ వంటి దేశాలలో ప్రాధాన్యత అన్నది దేశం నుండి మొదలై చివరిన వ్యక్తి స్థాయికి చేరుతుంది. అంటే అక్కడి ప్రజలు వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. మరి భారతదేశంలో అలా కాదు... స్వార్థం వ్యక్తిగత స్థాయి నుండే మొదలవుతుంది. మొదట వ్యక్తి... ఆ తర్వాత కుటుంబం... ఉంటున్న ఊరు... సొంత కులం, సొంత మతం, సొంత రాష్ట్రం... చివర్లో దేశం. ఇది మన దేశంలో ప్రజల ప్రాధాన్యతా క్రమం. ఇక్కడ ప్రజలు కులం కోసం, కుటుంబం కోసం, లేదా మతం, ప్రాంతం కోసం ఏకం అయినట్లుగా దేశ ప్రయోజనాల కోసం ఏకం కాలేరు. భిన్న సంస్కృతులకు, భిన్న మతాలకు, విభిన్న భాషలకే కాదు... విభిన్న ఆలోచనల దృక్పథాలకు కూడా ఈ దేశం వేదికవుతుంది! దేశం కోసం పోరాడే జాతీయవాదులకంటే కూడా దేశాన్ని ముక్కలు ముక్కలుగా నరకాలని నినదించే వారికి, ఉగ్రవాదుల జయంతులు, వర్ధంతులు నిర్వహించే వారికి ఇక్కడ భావ ప్రకటనా స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ దేశం భద్రత గురించి ఎక్కువగా ఆలోచించరు. దేశం ఎటుపోతే ఏమీ? ఎక్కడ ఉగ్రదాడులు జరిగి ఎవరు ఛస్తే మాకేంటి? మాదాకా రాలేదు కదా... మాకు పెట్రోల్ లీటర్ పాతిక రూపాయలకు రావాలి, డీజిల్ ఇరవై రూపాయలకు రావాలి, కిలో బియ్యం రూపాయికే ఇవ్వాలి, అన్న క్యాంటీన్‌లు, అమ్మ క్యాంటీన్‌లు, బాబాయ్ హోటళ్ళు ప్రభుత్వమే ఏర్పాటు చేసి 5రూపాయలకే భోజనం, టిఫిన్ పెడుతుండాలి. నెల తిరిగేసరికి ఠంఛన్‌గా వెయ్యి రూపాయల పింఛన్ అకౌంట్‌లో పడిపోవాలి. బ్యాంకులో తీసుకున్న లక్ష రూపాయల లోన్ మాఫీ కావాలి, నెలకు 10లక్షల ఆదాయం వస్తున్నా ఇన్‌కంటాక్స్ వుండకూడదు... ఇదే దేశంలో మెజార్టీ ప్రజల భావజాలం. దాదాపు ఏడు దశాబ్దాలుగా కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు అలవాటు చేసి పెట్టిన సోంబేరి సాంప్రదాయం!

ఇలాంటి సాంప్రదాయానికి అలవాటుపడ్డ ప్రజలను ఒక్కసారిగా నిఖార్సుగా పన్నులు కట్టమంటే... వాళ్ళకు ఇవ్వాల్సిన సబ్సిడీలు ఎత్తేస్తే... బ్లాక్‌లో కాకుండా బ్యాంకుల ద్వారా నగదు లావాదేవీలు జరపమంటే... విదేశాల అప్పులు తీర్చాలని చెప్పి ఇంధన ధరలు తగ్గించకుండా వుంటే, ఎప్పుడూ పన్నులు కట్టని వాళ్ళ చేత ముక్కు పిండి పన్నులు కట్టిస్తే... మరి మోడీ ప్రభుత్వం ఇంకోసారి అధికారంలోకి రాగలుగుతుందా?

ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ ముందున్న అతిపెద్ద సవాల్ భారతదేశమా? భారతీయ జనతా పార్టీయా? ఆయన దేశాన్ని గెలిపించాలంటే పార్టీని ఓడించుకోవాలి, పార్టీని గెలిపించుకోవాలంటే దేశభద్రత, ఆర్థిక పటిష్టత విషయంలో కొంత రాజీపడాలి.

నరేంద్ర మోడీపై ఎన్నో అంచనాలతో 2014 ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి భారీ మెజార్టీతో అధికారంలో కూర్చోబెట్టారు. ఎవరి మీద ఎన్ని అంచనాలు పెట్టుకున్నా ఇక్కడ లభ్యమయ్యే వనరులను సద్వినియోగం చేసుకుంటూనే మనం అభివృద్ధి చెందాలి. నాలుగున్నరేళ్ళ క్రితం ప్రధానిగా మోడీ పాలన మొదలైంది. ముఖ్యంగా విదేశాంగ విధానంలో మోడీ ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేసింది. శత్రుదేశాలను సైతం మిత్రదేశాలుగా మలచుకుంది. అంతర్జాతీయ ఉగ్రవాదంపై పోరుకు భారత్ సారధ్యంలోనే ప్రపంచ దేశాలు ఏకమయ్యాయి. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌ను అమెరికా ద్వారా కట్టడి చేయించగలిగింది. ఈరోజు ప్రపంచ దేశాలలోనే భారత్‌కు ఎనలేని గుర్తింపు గౌరవం వచ్చింది. దేశీయంగా చూస్తే మును పెన్నడూ లేనంత పటిష్టస్థితికి భారత్ ఆర్థిక వ్యవస్థ చేరుకుంది. జిడిపి రికార్డు స్థాయిలో వుంది. గత యూపిఏ ప్రభుత్వ హయాంలో చేసిన ఆయిల్ అప్పులను ఎన్డీఏ ప్రభుత్వం తీర్చింది. యూపిఏ ప్రభుత్వంతో పోలిస్తే ఉగ్రదాడులు తగ్గాయి. సరిహద్దుల్లో భద్రతా వ్యవస్థను పటిష్టం చేశారు. చొరబాట్లు తగ్గాయి. దేశమంతటా మౌలిక వనరుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. అన్నింటికి మించి కేంద్రప్రభుత్వ వ్యవస్థల్లో నిజాయితీతో కూడిన పరిపాలన నడుస్తోంది. ఏ శాఖలోనూ స్కాంలు లేవు. ప్రజా దోపిడీని తగ్గించారు. జిఎస్టీ అమలుతో ప్రభుత్వాదాయం గణనీయంగా పెరిగింది. కేంద్రప్రభుత్వం ద్వారా పలు స్కీంలు అమలవుతున్నాయి. రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ముద్ర లోన్‌లు, పంటల బీమా, అందరికీ ఇళ్లు వంటి పథకాలు అమలవుతున్నాయి. మోడీ నాలుగున్నరేళ్ళ పాలనలో దేశ రక్షణ వ్యవస్థ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా వుంది. అయినా వచ్చే ఎన్నికల్లో మోడీకి ఎదురుదెబ్బ తప్పదు. ఇది నిజం కావచ్చు కూడా! ఎందుకు నిజమవుతుందో కూడా చూద్దాం! దేశానికి జరిగే మంచికంటే తమకు కలిగే ప్రయోజనాల కోసమే ప్రజలు ఎక్కువగా ఆలోచిస్తారు. ఆశిస్తారు. విదేశాలకు మనం బాకీ వున్న ఒకటిన్నర లక్షల కోట్ల అప్పు చెల్లించిన విషయం ఎవరికీ పట్టదు. లీటర్ పెట్రోల్ 82రూపాయలకు పోయిస్తున్నప్పుడు అమిత బాధేస్తుంది. మన ఆస్తులన్నీ మోడీయే దోచుకుంటున్నాడన్న ఫీలింగ్ వస్తోంది. వంద కిలోమీటర్ల దూరం ప్రయాణానికి కూడా మనం కారు తీస్తాం... అదే బస్సో, ట్రైనో అయితే ఈ పెట్రల్ భారం తగ్గుతుందనే విషయం ఎవరూ ఆలోచించరు. యూపిఏ పరిపాలన చూసాం... అది మరీ స్కాంల పుట్ట. రేపు మోడీ ఆయిల్ ధరలు తగ్గించకపోతే ఆ స్కాంల ప్రభుత్వాన్నే ప్రజలు మళ్ళీ కోరుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. మోడీ ఇప్పటిదాకా దేశం కోసం పని చేసాడు. దేశ ప్రజలే కాదు, బీజేపీ శ్రేణులు కూడా ఆయనపై నమ్మకంతోనే ప్రధాని బాధ్యతను అప్పగించాయి. దేశాన్ని కాపాడడమే కాదు, తన పార్టీని కూడా ఆయన గెలిపించాలి. కనీసం ఈ ఆరు నెలలన్నా ఎలక్షన్ మైండ్‌లోకి పోవాలి. తన పరిపాలనలో ఏ అంశాలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారో గుర్తించాలి. ముఖ్యంగా బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్షాలు ఏకతాటిపైకి వస్తున్నాయి. మరి ఈ కూటమిని ఢీకొట్టి మోడీ బీజేపీని గెలిపిస్తాడో లేక నా మాట నేనే విననంటూ ఇదే విధంగా ముందుకుపోయి బీజేపీని ముంచుతాడో చూడాలి!

మోడీ నాలుగున్నరేళ్ళ పాలనలో దేశ రక్షణ వ్యవస్థ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా వుంది. అయినా వచ్చే ఎన్నికల్లో మోడీకి ఎదురుదెబ్బ తప్పదు. ఎందుకంటే, దేశానికి జరిగే మంచికంటే తమకు కలిగే ప్రయోజనాల కోసమే ప్రజలు ఎక్కువగా ఆలోచిస్తారు. ఆశిస్తారు. విదేశాలకు మనం బాకీ వున్న ఒకటిన్నర లక్షల కోట్ల అప్పు చెల్లించిన విషయం ఎవరికీ పట్టదు. లీటర్ పెట్రోల్ 82రూపాయలకు పోయిస్తున్నప్పుడు మన ఆస్తులన్నీ మోడీయే దోచుకుంటున్నాడన్న ఫీలింగ్ వస్తోంది.



## బహుభాషావేత్త నారాయణాచార్యులు

ఫ్రెంచ్, పర్షియన్ భాషలతో సహా 14భాషల్లో విస్తృత ప్రావీణ్యమున్న డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు బహుభాషావేత్తే కాకుండా బహుగ్రంథకర్తని అడ్వకేట్ కట్టా విజయభాస్కర్ కొనియాడారు. ఈ నెల 1న నెల్లూరులోని ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూలులో పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వచన, గేయ, కావ్య, విమర్శ అనువాద ప్రక్రియల్లో నారాయణాచార్యులు సిద్ధహస్తుడన్నారు. స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎస్.మధుసూదన్‌బాబు మాట్లాడుతూ పన్నెండేళ్ళ వయసులో తాను రచించిన పెనుగొండ లక్ష్మి అనే కావ్య ఖండికే ఆయన తన 30వ యేట విద్వాన్ పరీక్షలు రాసే నాటికి పాఠ్యపుస్తకంగా ఉండటం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన సాయికుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామ్మూర్తి, సతీష్‌కుమార్, మురళీమోహన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుట్టపర్తికి నివాళులర్పిస్తున్న ముఖ్యఅతిథులు

## సునీల్‌కుమార్‌కు డాక్టరేట్

విక్రమసింహపురి యూనివర్శిటీ పాలకమండలి సభ్యునిగా ఉన్న డాక్టర్ పి.సునీల్‌కుమార్‌కు ద్రవిడ యూనివర్శిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. టిటిడి-పరిపాలన అనే అంశంపై ఎస్వీయు పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ బి. వెంకటాచలపతి పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది.

## ఎల్ఐసిలో పోటీలు

బీమా వారోత్సవాల్లో భాగంగా నెల్లూరులోని ఎల్ఐసి డివిజన్ కార్యాలయంలో ఈ నెల3న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఉద్యోగులకు క్లెయిమ్స్ విభాగం ఆధ్వర్యంలో సందర్భ విశ్లేషణపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, జగదీశ్వరి, ప్రసాద్, దుర్గారాణి పాల్గొన్నారు.

## ఎయిర్ ఇండియాకు ఆర్థిక ఊరట

ప్రభుత్వ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు కేంద్రప్రభుత్వం 11వేల కోట్ల ఆర్థిక ఉద్దీపన ప్రకటించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం అభినందనీయం. ఎయిర్‌ఇండియా కొంతకాలంగా నష్టాల ఊబిలో ఇరుక్కుని వుంది. ఈ సంస్థకు ఆపరేషనల్ సామర్థ్యం, మెచ్చుకోదగిన ఇన్‌ఫ్లైట్ మరియు గ్రౌండ్ సేవలు సంతృప్తిగా వున్నప్పటికీ ప్రైవేట్ విమానసంస్థలతో పోటీపడి లాభాల బాట పట్టడం లేదు. 1980 నుండి 90వరకు ఈ సంస్థ బాగానే నడిచింది. 2000దశకం నుండే నష్టాలలో పయనిస్తున్నది. అయితే ఎయిర్ ఇండియా విమానయాన సేవలను మాత్రం అందరూ మెచ్చుకుంటారు.

**– ఆర్.ఎస్.నాథ్, నెల్లూరు.**

## ఆర్‌టిఓ చేయూత అభినందనీయం

కేరళ వరద బాధితుల సహాయానికి ప్రజల నుంచి విరాళాలు సేకరించాలని కలెక్టర్ కోరిన వెంటనే జిల్లా రవాణాశాఖ ఉపకమిషనర్ శివరామప్రసాద్ ఆదేశానుశారం కావలి పట్టణంలో వరద బాధితుల సహాయార్ధం విరాళాల సేకరణ కౌంటర్లను ఏర్పాటు చేయించి తన మానవతాదృక్పథాన్ని తెలియజేసి తక్షణం స్పందించిన ఆర్.టి.ఓ కె.మురళీమోహన్ అభినందనీయుడు. కార్యాలయ సిబ్బందితో పాటు దాతల నుంచి రూ.4,00,000/-లు విలువ చేసే 100బస్తాల బియ్యం, 300 వంట పాత్ర కిట్లు, 1000 దుప్పట్లు సేకరించి వరద బాధితులకు ఆర్‌టిఓ మురళీమోహన్ పంపించారు.

**యస్.బాబురావు, కావలి.**

## బాబు పోవాలి... మోడీ మళ్లీ రావాలి!

ఆంధ్రప్రదేశ్ బాగుపడాలంటే చంద్రబాబు పాలన పోవాలి. చంద్రబాబు ఆలోచనా విధానాలకు ఈ రాష్ట్రం సరిపోదు. సింగపూర్, జపాన్, జర్మనీ లాంటి దేశాలలో వుండాల్సిన నాయకుడాయన! ఆయన దుబారాను తట్టుకోవడం ఏపి ఆర్థిక వ్యవస్థకు అలివయ్యే పనికాదు. బాడీకి తగ్గ డ్రెస్ వేయమనే ముతకసామెత ఒకటుంది. కాని బాబు బాడీకి తగ్గ గుడ్డలేయడం లేదు. చంద్రబాబు మళ్ళీ కనుక అధికారంలోకి వస్తే ఏపి ఆర్థిక వ్యవస్థ దివాళా తీస్తుంది. దేశం బాగుండాలన్నా, భద్రంగా వుండాలన్నా నరేంద్రమోడీ మళ్లీ ప్రధాని కావాలి. ప్రపంచ దేశాలలో భారత ప్రతిష్టను పెంచిన ప్రధాని మోడీ! ఆయన పాలనలో దేశం అప్పులు తెచ్చుకునే స్థితి నుండి అప్పులు తీర్చే స్థాయికి ఎదిగింది. ఉగ్రవాదాన్ని బాగా కంట్రోల్ చేసారు. జమ్మూకాశ్మీర్‌ను దారిలో పెట్టారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ఇప్పుడిప్పుడే సత్ఫలితాలనిస్తున్నాయి. గ్యాస్ పెరిగిందని, పెట్రోల్ రేట్లు తగ్గలేదని, పన్నులు కట్టించుకుంటున్నారని, ఉచిత బియ్యం, కిరోసిన్, సబ్సిడీ లోన్‌లు ఇవ్వలేదని మోడీని ఓడిస్తే మన నెత్తి మీద మనం మట్టేసుకున్నట్లే! దేశంలోని అవినీతి దోపిడీదార్లంతా ఒక ముఠాగా కలుస్తున్నారు. ఈ ముఠాకు పెద్ద నాయకుడు చంద్రబాబు. ఈ దోపిడీ ముఠాకు దేశాన్ని అప్పగిస్తే సర్వనాశనమే!

**సి.రాజీవి, నెల్లూరు.**




## బాండ్ల సేకరణ బూటకం!

అమరావతి రాజదాని నిర్మాణానికి నిధులంటూ చంద్రబాబు బాండ్లు విడుదల చేయడం శోచనీయం. ఈయన బాండ్లు రిలీజ్ చేసాడు సరే... రేపు వాటిని ఎవరు తిరిగి చెల్లించాలి. అది కూడా వడ్డీతో కలిపి. రాష్ట్ర ఖజానా నుండే కదా ఇవ్వాలి! ప్రజల సొమ్మే కదా చెల్లించాలి. ఆయనను అప్పులు చేసి రాజధాని ఎవరు కట్టమన్నారు? రాష్ట్రంలో వున్న ఏదో ఒక నగరాన్ని రాజధానిగా చేసుకుని వుండుంటే ఆ నగరాలు ఇంకా అభివృద్ధి చెందేవి కదా! 35వేల ఎకరాల మాగాణి భూములను నాశనం చేయాల్సిన అవసరముండేది కాదు. వేలకోట్ల నిధులు వృధా అయ్యేవికావు.

**జి.ఎస్.రావు, నెల్లూరు.**




# చీలిన దారులు మళ్ళీ కలిసాయి

## శత్రువులే.. మిత్రులై...

***రాజకీయాలలో వీడు నాకు శత్రువు అని ఎవరినీ అనుకోనవసరం లేదు. అలాగే వీడు నా మిత్రుడు అని కూడా ఎవరినీ శాశ్వతంగా అనుకోనవసరం లేదు. ఈరోజు మిత్రుడు అనుకున్నవాడు రేపు మనకే ప్రత్యర్థి కావచ్చు. శత్రువు అనుకుని పోరాడినవాడు స్నేహితుడుగా మారొచ్చు. మన కళ్ళ ముందే ఎన్నో రాజకీయ స్నేహాలు శత్రుత్వాలు కావడం, స్నేహాలు శత్రుత్వాలుగా మారడం చూస్తుంటాం!***

ఈ కోవలోకి చెందినదే ఆనం రామనారాయణరెడ్డి – కాకాణి గోవర్ధన్‌రెడ్డిల బంధం. వీళ్ళిద్దరి దగ్గర నుండి వీళ్ళ స్నేహం మొదలు కాలేదు. ఆనం వెంకటరెడ్డి, కాకాణి రమణారెడ్డిల హయాం నుండే ఈ రెండు కుటుంబాల మధ్య రాజకీయ స్నేహముంది. వారి వారసత్వంగానే ఆనం రామనారాయణరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు ఒకే దారిలో నడిచారు. రాపూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి 1985, 1989, 1994, 1999, 2004 మొత్తం ఐదుసార్లలో రెండుసార్లు తెలుగుదేశం తరపున, మూడుసార్లు కాంగ్రెస్ తరపున పోటీ చేసాడు. రెండుసార్లు ఓడిపోయి మూడుసార్లు గెలిచాడు. రాపూరు నుండి పోటీ చేసిన ప్రతి ఎన్నికలలోనూ ఆనం రామనారాయణరెడ్డికి కాకాణి సహకరించాడు. చాలా ఏళ్ళ పాటు రాజకీయాలలో ఆనం అనుచరుడిగానే ముద్రపడివున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డికి 2006లో జడ్పీ ఎన్నికల ద్వారా ప్రత్యక్ష రాజకీయాలలోకి అడుగుపెట్టే అవకాశం దక్కింది. ఆ ఎన్నికల్లో మొదట కాంగ్రెస్ తరపున జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా ఆదాల రాఘవరెడ్డిని తీసుకొచ్చారు. అయితే జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో ఆయనకు బదులు కాకాణికి పిలుపొచ్చింది. ఆ ఎన్నికల ద్వారా కాకాణి తొలిసారి ప్రత్యక్ష రాజకీయాలలోకి అడుగుపెట్టాడు. సైదాపురం జడ్పీటీసీ స్థానం నుండి ఆనాడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పన్నిన రాజకీయ వ్యూహంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడమేకాక, కాంగ్రెస్‌కు అత్యధిక జడ్పీటీసీలు రావడంతో జడ్పీ ఛైర్మెన్‌గా అత్యంత సులభంగా ఎన్నికయ్యాడు. ఇక జడ్పీ ఛైర్మెన్‌గా తన పనితీరుతో మంచిపేరు తెచ్చుకోవడం తెలిసిందే!

జడ్పీ ఛైర్మెన్‌గా వున్న కాలంలోనే 2009 అసెంబ్లీ ఎన్నికలవైపు కాకాణి దృష్టి సారించాడు. ఆనం సోదరుల అండతో ఆరోజు ఆత్మకూరు అసెంబ్లీ కాంగ్రెస్ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. 2009 ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా కాకాణి ఆత్మకూరులో బాగానే పాకిపోయాడు. అయితే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ఆనం, కాకాణిల బంధానికి బీటలు వారేలా చేసింది. పునర్విభజనలో రాపూరు అసెంబ్లీ ఎగిరిపోయింది. ఆనం రామనారాయణరెడ్డి సర్వేపల్లిపై మనసుపడ్డా, ఆనాడు వై.యస్. ఒప్పుకోలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదాలదే సర్వేపల్లి అని తేల్చేసాడు. ఇక ఆనం రామనారాయణరెడ్డి ముందున్న మార్గం ఆత్మకూరు ఒక్కటే! ఎందుకంటే నెల్లూరురూరల్, సిటీ బి–ఫారాలు వాళ్ళ చేతుల్లో వున్నప్పటికీ ఒకటి బి.సి.లకివ్వాలి, ఇంకో దాంట్లో ఆనం వివేకా పోటీ చేయాలి. ఇక రామనారాయణరెడ్డికి మిగిలింది ఆత్మకూరే! దాంతో (మిగతా 11వ పేజీలో)



# ఆదాల డిసైడ్ అయితేనే.. అన్నీ సర్దుబాటు

***ఐపిఎల్ సీజన్‌లో ఫ్రాంఛైజీలు ఆటగాళ్ళను కొంటుంటాయి. విరాట్ కోహ్లీ, డుప్లెసిస్, క్రిస్ గేల్ వంటి ఆటగాళ్ళ కోసం అన్ని ఫ్రాంఛైజీలు పోటీ పడుతుంటాయి. అంటే వీళ్ళుంటే తమ జట్టు గెలుపు అవకాశాలు మెరుగ్గా వుంటాయని యజమానుల ఆశ!***

నెల్లూరుజిల్లా రాజకీయాలకు సంబంధించి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా ఒక విరాట్ కోహ్లీ మాదిరిగా తయారయ్యాడు. నేటి రాజకీయాలలో ఆయనకు డిమాండ్ బాగానే వుంది. ప్రస్తుతం ఆయన అధికార తెలుగుదేశంపార్టీలో వున్నప్పటికీ ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోనూ ఆయనకు డిమాండ్ వుంది. వైసిపిలోకి వస్తే ఆయనకు పార్లమెంట్ సీటుతో పాటు ఏదో ఒక అసెంబ్లీ సీటు కూడా ఆఫర్ వుంది. ఆదాల వైసిపిలోకి వస్తే పార్టీకి లాభం. పార్టీ వల్ల ఆయనకీ లాభం. అయితే ఆయన పార్టీ మారుతాడా? లేక తెలుగుదేశంలోనే వుంటాడా? అన్నది తేలాల్సి వుంది.

తెలుగుదేశం నాయకత్వం మాత్రం వచ్చే ఎన్నికల్లో ఆయనను వాడుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభకా లేక అసెంబ్లీకా అన్నది డిసైడ్ అయితే పార్టీలో మిగతా సీట్లన్నింటిని డిసైడ్ చేసే అవకాశాలున్నాయి. ఆదాల లోక్‌సభలో దిగేపనయితే లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీల అభ్యర్థుల ఎంపికలో ఆదాలదే కీలకపాత్ర అవుతుంది. ఆయన ఆలోచనల ప్రకారమైతే నెల్లూరు రూరల్ నుండి పి.నారాయణ, నెల్లూరు సిటీ నుండి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి లేదంటే అజీజ్, కోవూరు నుండి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కావలి నుండి బీద మస్తాన్‌రావు, కందుకూరు నుండి పోతుల రామారావు, ఉదయగిరి నుండి కావ్య కృష్ణారెడ్డి, ఆత్మకూరు నుండి మెట్టుకూరు ధనుంజయరెడ్డి లేదా బొల్లినేని కృష్ణయ్య... ఇదీ ఆదాల తాను లోక్‌సభకు దిగాల్సి వస్తే అసెంబ్లీకి ఆలోచించే అభ్యర్థుల టీమ్. ఆదాల లోక్‌సభ అభ్యర్థి అయితే ఈ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా వైసిపికి గట్టిపోటీ తప్పదు. (మిగతా 11వ పేజీలో)








# మూడు రెండయ్యేనా?

నెల్లూరుజిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో తరచుగా వినిపించే మాట... ఒకే ఇంటిలో మూడు టిక్కెట్లు అవసరమా? పార్టీలో మేకపాటి కుటుంబసభ్యులకు సంబంధించి పలుసార్లు పలువురు సంధించిన ప్రశ్న ఇది! ఒకప్పుడు ఒకే కుటుంబంలో రెండు టిక్కెట్లు ఇస్తేనే అది కుటుంబ పెత్తనంగా వుండేది. 2014 ఎన్నికల్లో మేకపాటి కుటుంబసభ్యులు నెల్లూరు లోక్‌సభ, ఆత్మకూరు, ఉదయగిరి అసెంబ్లీల నుండి పోటీ చేసారు. నెల్లూరు లోక్‌సభ, ఆత్మకూరు అసెంబ్లీలలో గెలిచి ఉదయగిరిలో ఓడిపోయారు. అయితే 2014కు ఇప్పటికీ పరిస్థితుల్లో చాలా తేడా వుంది. ఇప్పుడు పార్టీలోకి కొత్త నాయకులు వచ్చారు. జిల్లాలో వుండేది ఒక లోక్‌సభ, పది అసెంబ్లీ సీట్లు. ఇందులో రెండు రిజర్వుడ్ సీట్లు పోతాయి. బి.సిలకు నెల్లూరు నగరం సీటును ఎత్తి పెట్టినట్లే! మిగిలిన ఏడు సీట్లలో సిటింగ్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు వున్నారు. వీళ్లలో ఎవరినీ తీసి పక్కన పెట్టలేరు. పార్టీలో ఆనం రామనారాయణరెడ్డితో పాటు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు కూడా టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో వున్నారు. వీరిలో ఏ ఇద్దరికీ టిక్కెట్లు ఇవ్వాలన్నా మేకపాటి ముగ్గురిలో ఒకరికి కోత వేయక తప్పదు. ఆ ఒక్కరు ఎవరన్నది వీళ్లే తేల్చుకోవాల్సి వుంటుంది. కాని ఈసారి మాత్రం మేకపాటి కుటుంబం నుండి ఇద్దరికే సీట్లు అనే టాక్ బలంగా వుంది.

జక్కా హర్షవర్ధన్‌రెడ్డి

జననం: 04.10.1957 మరణం: 07.09.1997

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్వాపో నశోషయతి మారుత: ॥ (గీత)

## సంస్మరణ

మా అందరిలో ఒకడిగా, మాకందరికీ తోడుగా
నీవు లేని ఈ లోకం, రూపుదాల్చిన శోకం!
మా గుండెల్లో గుడి కట్టి పదిలంగా నిలిచావు.
మా హృదయాల్లో కలకాలం జీవించే ఉంటావు!!

నీ స్మృతిలో..

స్వప్న - భార్య

జె.వి.రెడ్డి - తండ్రి
జానకి - తల్లి

కుమార్తెలు - అల్లుడు
సంజన - కుషాన్
సుస్మిత

చెల్లెలు - బావ
శరణ్య - డా॥ అశోక్

మేనల్లుడు - మేనకోడలు
అశ్విన్ - షీనా

మరియు
కుటుంబసభ్యులు

# నెల్లూరు కబుర్లు

## విఆర్‌సి ఎన్నికలకు సన్నద్ధం!




నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థల కొత్త పాలక వర్గానికి ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. పాతికేళ్ళ క్రితం ఆనం వివేకానంద రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిల నేతృత్వంలో ఏర్పడ్డ కమిటీని సుప్రీం కోర్టు ఇటీవల రద్దు చేయడం తెలిసిందే! బైలాస్‌కు విరుద్ధంగా అప్పట్లో ఏకపక్షంగా ఎన్నికలు జరుపుకుని పాలకవర్గం ఏర్పడిందంటూ బీజేపీ నాయకులు ఆమంచర్ల శంకరనారాయణ మరికొందరు న్యాయస్థానాలలో సుదీర్ఘకాలం చేసిన పోరాటం ఫలితంగా ఈ కమిటీ రద్దయ్యింది. విఆర్ విద్యాసంస్థల పర్యవేక్షణకు జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వీని ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగింది. అయితే ఈ ఏడాది జూలైలోపు ఎన్నికలు జరిపి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించినా ఇంతవరకు ఆ పని జరగలేదు. తాజాగా గతంలో ఆమంచర్ల శంకరనారాయణ ఎన్నికల నిర్వహణలో జాప్యంపై చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు అక్టోబర్ 31వతేదీ లోపు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియకు కసరత్తు మొదలుపెట్టింది.

## పారిశుద్ధ్యం అధ్వాన్నం



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న డిప్యూటీ మేయర్ ముక్కాల, రూప్‌కుమార్ తదితరులు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోజురోజుకి దిగజారుతున్న పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం పరిస్థితులపై చర్చించేందుకు అత్యవసరంగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ పి. రూప్‌కుమార్‌యాదవ్, పలువురు కార్పొరేటర్లతో సహా కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ఈ నెల 1న వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ, జిఓ నం. 279ని రద్దుచేయాలని కోరుతూ గత 19 రోజులుగా పారిశుద్ధ్యకార్మికులు సమ్మె చేస్తున్నా పాలకవర్గం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో నెల్లూరు నగరం నరకకూపంలా తయారైందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల కష్టాలను గుర్తించకుండా అధికారపార్టీ నాయకులు 'హ్యాపీ సండే', 'నారా హమారా' లాంటి కార్యక్రమాలు చేపడుతుండడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో జిఓ నం. 279 వచ్చినప్పుడు మేయర్ అందుబాటులో లేకపోయినా సమస్య పరిష్కారమైందని, ఇప్పుడు మేయర్ అందుబాటులో ఉన్నా సమస్య పరిష్కారం కాకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్పొరేటర్లు వేలూరు సుధారాణి, లక్ష్మీసునంద, కుంచాల కృష్ణవేణి, కమల్‌రాజ్ సంపూర్ణ, ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణయ్య జన్మదినాన.. శివయ్యకు పూజలు



సైకత శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న పినాకిని స్విమ్మర్స్

ఈ నెల 2వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు పెన్నానదిలో సైకత శివ లింగాన్ని దానిపైన శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ పూజలలో స్విమ్మర్స్ మోపూరు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ సర్వేక్షణ్' అందరి బాధ్యత

### - కమిషనర్ ఆలీమ్‌బాషా

'స్వచ్ఛ సర్వేక్షణ్' అందరి బాధ్యత అని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ ఆలీమ్ బాషా పేర్కొన్నారు. స్థానిక మాగుంట లేఅవుట్ లెక్చరర్స్ కాలనీలోని నవనీత పార్కు ప్రాంతంలో కృష్ణపట్నం పోర్టు స్కిల్‌డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటుచేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ స్వచ్ఛభారత్‌లో పాల్గొని మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన వీధులు బాగుంటే మన నగరం బాగుంటుందని, నగరం బాగుంటే రాష్ట్రం, రాష్ట్రం బాగుంటే దేశం బాగుంటుందని అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే చెత్తను నిర్దేశిత ప్రాంతంలోనే వేయాలన్నారు. వేదవ్యాస పాఠశాల విద్యార్థులతోపాటు కృష్ణపట్నంపోర్టు సిబ్బంది చేత ఆయన స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నగరంలో జరిగిన ర్యాలీలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛభారత్ అంటూ నినాదాలు చేశారు. గత కొన్నిరోజులుగా స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహణలో ప్రతిభ కనపరిచినవారికి ఈ సందర్భంగా ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె కయిూమ్, జివిజి ఛైర్మెన్ జి.సాంబశివరావు, మోహన్ రెడ్డి, ఇ.డి రాజేంద్రప్రసాద్, ఎస్‌పి రామారావు, డిజిఎం టి.ఎస్ మనోహర్‌బాబు, నారాయణస్వామి, వేదవ్యాస విద్యార్థులు, సిబ్బంది, కృష్ణపట్నం పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

## అటల్‌జీపై కవితలకు ఆహ్వానం

మాజీ ప్రధాని, కవి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం, వ్యక్తిత్వం ఆధారంగా ఒక కవితా సంకలనం ప్రచురించాలని అఖిల భారతీయ సాహిత్య పరిషత్(ఆంధ్రప్రదేశ్) నిర్ణయించిందని, కవులు తమ కవితలను సెప్టెంబర్ 10వ తేదీలోగా పంపాలని నెల్లూరు జిల్లా రచయితల సంఘం(నెరసం) అధ్యక్షులు ఏ.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కవులు తమ కవితలను వాజ్‌పేయి కవితా సంకలనం 9ఎట్ జి.మెయిల్ డాట్‌కామ్ అనే మెయిల్ ఐడికి పంపాలని, వివరాలకు డా. మోపిదేవి విజయగోపాల్, సెల్‌ఫోన్ నంబరు : 9490679570 కు సంప్రదించాలని ఆయన కోరారు.

## అంధులకు కంటివెలుగు

నెల్లూరులోని మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ద్వారా 2006 నుంచి ఇప్పటిదాకా 3526 నేత్రాలను నేత్రదాతల ద్వారా సేకరించామని, కార్నియా అంధత్వం వల్ల బాధపడేవారికి తమ రీసెర్చ్ సెంటర్‌లో 578 నేత్రాలను అమర్చామని ఆ సెంటర్ డాక్టర్ ఇఎల్‌ఎస్ జ్యోతి తెలిపారు. ఈ నెల 1న స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిగిలిన నేత్రాలను ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంక్, చిరంజీవి ఐ బ్యాంక్‌లకు పంపామని వివరించారు.

## వాయిదాపడ్డ హోం మంత్రి పర్యటన

ఈ నెల 5వ తేదీ ఉండాల్సిన హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, డిజిపి ఆర్.వి.ఠాకూర్‌ల పర్యటన వాయిదా పడింది. 5వ తేదీ వీళ్ళ చేత నెల్లూరులో అధునాతనంగా నిర్మించిన నెల్లూరు రూరల్, నాలుగో నగర పోలీసుస్టేషన్‌లను, అలాగే విడవలూరు పోలీసుస్టేషన్‌ను ప్రారంభించాల్సి వుండింది. అయితే అసెంబ్లీ సమావేశాల కారణంగా వారి పర్యటనను ఈ నెల 24వ తేదీకి మార్చినట్లు సమాచారం.

## నీటి కోసం కోటి పాట్లు

### శెట్టిగుంటరోడ్డులో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

నెల్లూరు నగరప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడిపోయే దుస్థితి ఏర్పడింది. భూగర్భడ్రైనేజీ, తాగునీటి పథకం పనుల కోసం ఎక్కడంటే అక్కడ తవ్వుతూ పైప్‌లైన్లు పగులగొట్టడంతో నగరంలో పలుచోట్ల నీరు సక్రమంగా రాక ఆయా ప్రాంతాల్లో ప్రజలు అవస్త పడుతున్నారు. నీరు రాని ప్రాంతాలకు కార్పొరేషన్‌వారు ట్యాంకర్లతో నీరు పంపుతున్నా, అవి సామాన్యుల దాకా చేరడం లేదు. డబ్బిచ్చినవారికే నీరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న నగరంలోని శెట్టిగుంటరోడ్డులో ఉన్న ప్రజలు,పెద్దసంఖ్యలో మహిళలు రోడ్లపైకి వచ్చి ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అందరికీ నీరు సరఫరా చేయాలంటూ నినదించారు. దీంతో అధికారులు వచ్చి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



పవన్ కళ్యాణ్ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న వియస్‌యు విద్యార్థులు

నెల్లూరులోని విఎస్‌యు విద్యార్థి సమాఖ్య, జనసేన పార్టీ భగత్‌సింగ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 2న సినీ నటుడు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు నెల్లూరు విజయమహల్‌గేట్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పవన్ పిలుపుమేరకు కేరళ వరద బాధితుల సహాయార్థం విఎస్‌యు విద్యార్థులు 5వేల నగదు సిఎం సహాయనిధికి పంపారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు విద్యార్థులు జొన్నలగడ్డ సుధీర్, మల్లి శ్రీకాంత్, కిరణ్‌కుమార్, వినయ్, మహేంద్ర, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్సైలు

## మంత్రి సోమిరెడ్డిని కలిసిన ఎస్సైలు

పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు పొంది జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్సైలు ఆర్ అండ్ బి అతిథిగృహంలో రాష్ట్రమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఈ నెల 1న కలిసి తమ గోడును వెలిబుచ్చారు. 2009 బ్యాచ్ నుంచి ఎస్సైలుగా పనిచేస్తున్న వారందరికీ వెంటనే పదోన్నతి కల్పించాలని వారు ఆయనను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చాడు.

## పదవీ విరమణ పోలీసులకు సన్మానం



సన్మానాలందుకున్న పోలీసులు

గతనెల 31న పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐలు నాగేశ్వరరావు, రామచంద్రుడు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంలను అదే రోజు సాయంత్రం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పరమేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, పదవీవిరమణ చేసిన పోలీసులకు ఏ అవసరం వచ్చినా తాము అందుబాటులో ఉంటామన్నారు. ఏఆర్ డిఎస్పీ చంద్రశేఖర్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.శ్రీనివాసులు, ఏఆర్ ఆర్ఐ(వెల్ఫేర్) చంద్రమోహన్, ఏఆర్ ఆర్ఐ మౌలుద్దీన్, ట్రాఫిక్ సిఐ వేమారెడ్డి పాల్గొన్నారు.

## ప్రింటర్స్ విరాళం



జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు

కేరళ ప్రింటర్స్ అసోసియేషన్ వారి విన్నపం మేరకు వరద బాధితుల సహాయార్థం నెల్లూరుజిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ వారు విరాళాలు సేకరించి రూ. 50,250లును గత నెల 31న గుంటూరులోని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు అందజేసినట్లు నెల్లూరుజిల్లా ప్రింటర్స్ అధ్యక్షుడు గుండాల ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటి జిల్లా అధ్యక్షకార్యదర్శులను అభినందించిందని తెలిపారు.

# ఐపిపిబి సేవలతో...
# తపాలాశాఖకు పూర్వ వైభవం

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**




పోస్టల్ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ప్రారంభిస్తున్న ఎంపి వేమిరెడ్డి, మేయర్ అజీజ్, ఎమ్మెల్సీ బీద

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్(ఐపిపిబి) సేవలతో తపాలాశాఖకు పూర్వ వైభవం వస్తుందని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 1న ఆయన నెల్లూరులోని ప్రధాన పోస్టాఫీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని తపాల బ్యాంకు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ బ్యాంక్‌లతో పోటీపడేలా డిజిటల్ బ్యాంకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిన తపాలా బ్యాంక్ సేవలను అభినందించారు. ఈ సేవల ద్వారా నగదు రహిత లావాదేవీలను కూడా పరోక్షంగా ప్రోత్సహించడం శుభ పరిణామమన్నారు. కేవలం ఆధార్‌కార్డు తెస్తే వేలిముద్ర ద్వారా జీరో బ్యాలెన్స్‌తో నూతన బ్యాంకు ఖాతాలు తెరవడం వల్ల పేదలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ సూపరింటెండెంట్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ తపాల శాఖ ఐపిపిబి ద్వారా బ్యాంకింగ్ సేవలను ప్రజల చెంతకే తీసుకువచ్చిందన్నారు. విద్యుత్, ఇంటిపన్నులు, ఎరువులు, మనీ ట్రాన్స్‌ఫర్ వంటి సేవలను పొందవచ్చన్నారు. నెల్లూరు డివిజన్‌లో 5 కేంద్రాలను, జిల్లాలో మొత్తంగా 10 కేంద్రాలను ప్రారంభించామన్నారు. అనంతరం క్విజ్ విజేతలైన మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలతో పాటు తపాలశాఖ అధికారులు, పోస్ట్‌మాస్టర్లు, తపాల సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయానికి అధిక సాయం



**- మంత్రి సోమిరెడ్డి**

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత వ్యవసాయ రంగమేనని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 1న ఆయన నెల్లూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ రైతుల బాగు కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ మాసాంతానికి 4,5 విడతలకు సంబంధించి రైతు రుణమాఫీకి 10 శాతం వడ్డీతో సహా 7,500 కోట్ల రూపాయలను నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వర్షాభావంతో ఉన్న 296 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు సుమారు 84 లక్షల క్వింటాళ్ల దాకా విత్తనాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని, కరువు మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే వారికి ఉచితంగా విత్తనాలు అందించడం జరుగుతుందని తెలిపారు. తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, సోమశిల ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీటి నిలువలున్నాయన్నారు. జాతీయస్థాయిలో వ్యవసాయ రంగ అభివృద్ధి సూచిక 2017-18 సంవత్సరానికి 14.8 శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల 29.8 శాతం అభివృద్ధిని సాధించడం జరిగిందన్నారు. భూసార పరీక్షల్లో ప్రథమస్థానం, సూక్ష్మపోషకాల విషయంలో 100 శాతం అభివృద్ధి సాధించామన్నారు. బిందు, తుంపర సేద్యం అభివృద్ధికి ఇప్పటి దాకా సుమారు 1380 కోట్లు వెచ్చించామన్నారు. రానున్న అయిదేళ్లలో కోటి ఎకరాల్లో ఉద్యానపంటలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉన్నందువల్ల అమెరికా వంటి దేశాలు యుఎన్‌ఐపిలో మన రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రసంగించాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. రెయిన్ గన్స్ ద్వారా సుమారుగా 18,708 హెక్టార్లలో పంటలను రక్షించామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించండి

## కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి విన్నవించిన కోటంరెడ్డి



నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో సమస్యలను పరిష్కరించాలంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 1న కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి ఆయా సమస్యలను చర్చించారు. 2, 18, 19, 20, 23, 27, 28, 30, 31, 33, 35 డివిజన్లలోని పలు సమస్యలను ఆయన కమిషనర్‌కు వివరించారు. పారిశుద్ధ్యం, సిసి డ్రైన్‌లు, సిసి రోడ్లు, డీప్‌బోర్లతో పాటు కుక్కలు, పందులు, కోతుల వల్ల వస్తున్న సమస్యలను కూడా ఎమ్మెల్యే వివరించారు. 27వ డివిజన్‌లోని త్యాగరాజనగర్, వేదాయపాళెం రైల్వేస్టేషన్ ముందు ఉన్న మురికినీటి సమస్యతో స్థానిక ప్రజలు రోజులతరబడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెలల తరబడి మురికినీరు భూగర్భజలాలతో కలసి మంచినీరు కలుషితమవుతున్నదని, తద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని అంటూ, ఈ విషయంలో రైల్వేశాఖ, కార్పొరేషన్‌లు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించాలన్నారు. రైల్వే స్థలంలో ఉన్న కచ్చాడ్రైన్‌ను సిసిడ్రైన్‌గా అభివృద్ధి చేసేందుకు అనుమతి కోరుతూ రైల్వే శాఖవారికి లేఖను పంపాలని కమిషనర్‌ను ఆయన కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ ఆ మేరకు లేఖ పంపుతామన్నారు.

# నేత్రపర్వంగా కృష్ణాష్టమి





శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఈ నెల 3, 4 తేదీల్లో నెల్లూరులోని పలు విద్యాసంస్థల్లో నయనానందకరంగా వేడుకలు జరిగాయి. డా.కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ పాఠశాలలో చిన్నారులు వేసిన చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపాల్ సునీత, కోఆర్డినేటర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

**రెయిన్‌బోలో...**

నెల్లూరు రూరల్‌మండలంలోని కలివెలపాళెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్‌ఇ పాఠశాలలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఈ నెల 3న ఘనంగా జరిగాయి. 1,2 తరగతుల పిల్లలు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అందరినీ అలరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ శ్రీ రామగిరి విద్యాసాగర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి హరితారెడ్డి, సురేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ నేతాజీలో...**

శ్రీ నేతాజీ (ఎంఎస్‌ఆర్) పైలట్ హైస్కూల్‌లో కన్నులపండువగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. చిన్నారులు రాధా కృష్ణుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ ఎంవి సుబ్బారెడ్డి, డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ డి.వాణి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, హెడ్మాస్టర్ ఎస్‌వివిఎల్ నరసింహారావు తదితరుల పర్యవేక్షణలో ఈ వేడుక జరిగింది.

# హడలెత్తిస్తున్న ట్రాక్టర్లు



నెల్లూరు-జొన్నవాడ రోడ్డులో ఇసుక ట్రాక్టర్లు హడలెత్తిస్తున్నాయి. వాటి వేగానికి ఆ రోడ్డులో వెళ్ళే ఇతర వాహనాల వాళ్ళు, ద్విచక్రవాహనదారులు బెంబేలెత్తుతున్నారు. పొట్టేపాలెం ఇసుక రీచ్ నుండి నెల్లూరు నగరంలోకి రోజూ వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు వస్తుంటాయి. నిర్ణీత వేళల్లో మాత్రమే పోలీసులు ఈ ట్రాక్టర్లను నగరంలోకి అనుమతించడం జరుగుతుంది. ఈ తక్కువ వ్యవధిలోనే వీలైనన్ని ఎక్కువ ట్రిప్పులు తోలాలనే ఆత్రుతతో డ్రైవర్లు ట్రాక్టర్లను అత్యంత వేగంగా తోలుతుంటారు. ఈ ట్రాక్టర్లకు బ్రేకులు సరిగా పడవు. దీనికితోడు అడ్డదిడ్డంగా దూరుతుంటారు. దాంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ట్రాక్టర్ల వేగానికి కళ్లెం వేయాల్సి వుంది.

# ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ


వెంకటాచలంలోని స్వర్ణభారత్ గ్రామీణాభివృద్ధి సంస్థ (సెరైడ్) ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఎయిర్ కండిషన్ అండ్ రెఫ్రిజిరేటర్, మొబైల్ సర్వీసింగ్, ఎలక్ట్రికల్ మోటార్ రివైండింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి చదివి, 18 సంవత్సరాలు పూర్తయ్యి, 45 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని, నెలరోజులపాటు జరిగే ఈ శిక్షణ సమయంలో ఉచిత భోజనం, ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జెరాక్సులతో రావాలని తెలిపారు. వివరాలకు 0861-2383555, 9494133370 ఫోన్ నంబర్లతో సంప్రదించవచ్చన్నారు.



# కల్యాణ వైభవం...!





నెల్లూరు వాస్తవ్యులు యరమాక శ్రీనివాసులురెడ్డి-నిరూపల కుమారుడు **ప్రీతమ్ - సుప్రజ** (హైదరాబాద్ వాస్తవ్యులు అన్నారెడ్డి వెంకటరమణారెడ్డి - స్వర్ణలతల కుమార్తెల వివాహం ఆగస్టు 30వ తేదీ హైదరాబాద్‌లోని బృందావన్ గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.




సత్యసాయి భక్తుడిగా అందరికీ సుపరిచితుడు గాదంశెట్టి సుధాకరరావు - లక్ష్మీకుమారిల కుమారుడు **వెంకట సాయి చైతన్య - వైష్ణవి** (చిత్తూరు జిల్లా వాస్తవ్యులు చింతలపల్లి నగేష్ - రేవతిల కుమార్తెల వివాహం ఆగస్టు 30వ తేదీ నెల్లూరులోని కెపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.




నెల్లూరు వాస్తవ్యులు, లెక్కల మాంత్రికుడి(ఆడిటర్)గా ప్రఖ్యాతిగాంచి దుబాయ్‌లో నెల్లూరు ఖ్యాతిని వెదజల్లుతున్న సుంకు సత్యసాయి ప్రకాష్ - శ్రీలతల కుమారుడు **సాయికృష్ణ - అనుతేజస్వి** (మెంటా ఆంజనేయులు - స్వర్గీయ ఉమారాణిల కుమార్తెల పెళ్లి ఆగస్టు 19వ తేదీ నెల్లూరులోని డిఆర్ కన్వెన్షన్ హాల్ నందు జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.




గూడూరు వాస్తవ్యులు బత్తిన భాస్కర్‌రెడ్డి - సునందల కుమారుడు **శ్రీకాంత్‌రెడ్డి - దివ్య** (నెల్లూరు వాస్తవ్యులు యేకొల్లు ఇందూధర్‌రెడ్డి - ప్రసూనల కుమార్తెల పరిణయం ఆగస్టు 30వ తేదీ నెల్లూరులోని స్వర్ణవేదిక కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది




వివేకానంద స్కూల్ చంద్రమోహన్, వంశీకృష్ణలను సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు

సమాజంలో భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని పలువురు వక్తలు కొనియాడారు. సెప్టెంబర్ 5వ తేది ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 3న ఆంధ్రప్రదేశ్ అన్ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్- గూడూరు నియోజక వర్గం అధ్యక్షులు బి.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయుల పండుగ-2018 ఎంతో వేడుకగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపి అన్ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి. మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది గురువులేనన్నారు. అందువల్లనే గురువులను ప్రతిఒక్కరూ జీవితాంతం గుర్తుపెట్టుకుంటారన్నారు. చిల్లకూరు ఎంఇఓ జి.మధుసూదనరావు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ప్రతినిధులు గురువుల ఔన్నత్యాన్ని వివరించారు. శ్రీ వివేకానంద పాఠశాల కరెస్పాండెంట్ చంద్రమోహన్, వంశీకృష్ణలను ఈ సందర్భంగా ఘనంగా శ్రీకాంత్‌రెడ్డి సత్కరించారు. అనంతరం, నియోజకవర్గంలోని అన్ని ప్రైవేట్‌పాఠశాలల నుండి ఇద్దరు ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి అన్ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు దశరధరామిరెడ్డి, బాలకృష్ణమరాజు, పవన్‌కుమార్, బాలచెన్నయ్య, కిషోర్, శారదమ్మ, చంద్రమోహన్, వంశీకృష్ణ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## వాడవాడలా వైఎస్ఆర్‌కు నివాళి



పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న వైకాపా నాయకులు

దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 1న గూడూరు మండలం చెన్నూరులో వైఎస్సార్సీపి నాయకుడు రాజగోపాల్ దాతృత్వంతో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మండలంలోని తిప్ప వరప్పాడు, గొల్లపల్లి, నెల్లటూరు, దివిపాళెం, విందూరు, మిట్టాత్మకూరు, మంగళవూరు తదితర ప్రాంతాల్లోని వైఎస్ విగ్రహాలకు వైకాపా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైకాపా నాయకుడు మేరిగ మురళి, ఎల్లసిరి గోపాలరెడ్డి, కోడూరు మీరారెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, బత్తిన విజయకుమార్, బాలచంద్రారెడ్డి, రాధారెడ్డి, రాజారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, మండ్ల సురేష్‌బాబు, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక రోడ్లు భవనాల అతిథిగృహంలో కూడా డా.వైఎస్ వర్ధంతిని ఘనంగా నిర్వహించి నాయకులు నివాళులర్పించారు.

## ఉచిత వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి

గూడూరు పట్టణంలోని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 2న పేదలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు నిర్వహించారు. స్థానిక సాయిబాబా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు సి.జనార్ధన్‌రెడ్డి, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షులు, ఇన్నర్‌వీల్ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిణి సహకారంతో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధులు విష్ణు వందన, జమున, సౌందర్యమ్మ, ప్రభ, స్నేహ, స్వర్ణ, పద్మ పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడాకారులకు బహుమతులు




గూడూరులోని లయన్స్‌క్లబ్, పాశం స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవంలో విజేత చిట్టమూరు ప్యాడి లెవన్స్ జట్టుకు, రన్నర్ చిల్లకూరు సిలికా లెవన్స్ జట్టుకు, టోర్నమెంట్లో అత్యంత ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ బహుమతి ప్రదానోత్సవంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డీఎస్పీ రాంబాబు, నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, ఎంపిడిఓ అన్నపూర్ణ, ఎంఇఓ మధుసూదన్‌రావు, లయన్స్ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, రామ్మోహన్, చందు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాబు

చిల్లకూరులోని శంకర గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇటీవల గూడూరు మహాలక్ష్మి జ్యూయలరీ యజమాని ఎస్ఎల్ఎన్ బాబు తన వితరణతో నోటుపుస్తకాలను, పలకలు, పెన్‌లు, విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదనరావు, జమల్ల ప్రకాశ్, ఎన్.చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పార్టీగా కాంగ్రెస్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్ జనపథ్... తన గదిలో కూర్చుని సోనియాగాంధీ పమిటచెంగు నోట్లో పెట్టుకుని వెక్కివెక్కి ఏడుస్తుంది. వి. హెచ్. హనుమంతరావు కాఫీకప్పు పట్టుకుని ఊరుకోండి... మేడమ్, ఏడిస్తే పోయింది వస్తుందా అని ఓదారుస్తున్నాడు. అప్పుడే సైక్లింగ్ పూర్తి చేసుకుని రాహుల్‌గాంధీ వచ్చాడు. ఏడుస్తున్న తల్లిని చూసి... మమ్మీ నువ్వు ఎంత ఏడ్చినా నేను ఇప్పుడే పెళ్లి చేసుకోను... అయినా పెళ్లి చేసుకుని సాధించేదేముంది. ఒక అబ్దుల్‌కలాం.. ఒక వాజ్‌పేయి... ఒక మోదీ... పెళ్లి లేకుండా పెళ్లాం పక్కన లేకుండా రాష్ట్రపతులు, ప్రధానులు కాలేదా? అని అన్నాడు. అది విని వి. హెచ్. హనుమంతురావు కోపంతో... మీ అమ్మ ఏడిస్తే నీ పెళ్లి ఒక్కటే సబ్జెక్టా... ఇంకేమీ వుండవా? ఆమె ఏడుస్తున్నది నీ పెళ్లి గురించి కాదు. కాంగ్రెస్‌పార్టీ గురించి. ఒకప్పుడు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వున్న పార్టీ... ఇప్పుడు కేవలం నాలుగైదు రాష్ట్రాలకే పరిమితమైంది. జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీగా మారి పోయిందని ఆమె ఆవేదన అని ఆవేశంగా చెప్పాడు. అందుకు రాహుల్... ఓహో ఇప్పుడు మన పార్టీ స్థాయిని పెంచాలి, అదే కదా మీకు కావాల్సింది అని రాహుల్ అన్నాడు. అంతే అని వి. హెచ్ చెప్పాడు. ఒక్క నెలరోజులు నన్ను వదిలేసేయండి. ఆ తర్వాత నేనేంటో మీరు చూస్తారు అంటూ రాహుల్ అక్కడనుండి హుషారుగా వెళ్లిపోయాడు. రాహుల్ ఆత్మ విశ్వాసం చూసి సోనియాగాంధీ మనసులో ఈ తింగరోడు మళ్లీ ఏం తింగరి పనులు చేస్తాడోనని సందేహించసాగింది.

★★★★★

గిర్రున నెలరోజులు తిరిగాయి. రాహుల్ ట్రావెల్ బ్యాగ్‌ను ఈడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. రాహుల్‌ను చూడగానే వి. హెచ్... బాబూ బాగా అలిసిపోయి వస్తున్నట్లున్నారు, కాఫీ తెమ్మంటారా అని అడిగాడు. ఇప్పుడేం వద్దులే హనుమాన్‌జీ అని రాహుల్ ఆయన వైపు కన్నుకొట్టి మాట్లాడాడు. రాహుల్ కన్ను కొట్టడం చూసి వి. హెచ్ గుండె గతుక్కుమంది. ఈ తింగరోడు నెలరోజులు బయట తిరిగి నేర్చుకున్నది ఇదా అని నిట్టూర్చాడు. అప్పుడే అక్కడకు సోనియా, అంబికాసోని, పనబాక లక్ష్మి, కుమారి షెల్జాలు వచ్చారు. రాహుల్‌తో సోనియా వుండి... పార్టీని ఏదో ఉద్ధరిస్తానని నెలరోజులు బయట తిరిగొచ్చావు కదా, ఎక్కడెక్కడ తిరిగావ్, ఏమేం చేసావ్ అని అడిగింది. అది చెప్తే తెలిసేది కాదు మమ్మీ... చూపిస్తాను చూడండి అంటూ అంబికాసోని, కుమారి షెల్జాల వైపు చూసి కన్నుకొట్టాడు. ఆ సంఘటనకు అంబికాసోని అదిరిపోయి... మేడమ్ మన రాహుల్‌కు పెళ్లి వయసు వచ్చినట్లుంది, పెళ్లి చేయకూడదా అని సోనియాను అడిగింది. పెళ్లి వయసు రావడం కాదు అంబికా, అది దాటిపోయి పాతికేళ్లు కావస్తుంది. అయినా వాడి నుదుటి మీద పెళ్లి గీత లేనప్పుడు మనం ఎంత ప్రయత్నించి ఏం లాభం అంటూ నిట్టూర్చింది. ఈలోపు రాహుల్ బ్యాగులో నుండి ఒక సి.డి తీసి కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

అది జర్మనీ... రాహుల్ అక్కడ ప్రసంగిస్తున్నాడు. ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది. రాఫెల్ డీల్‌లో వేలకోట్ల అక్రమాలు జరిగాయి. అరెస్సెస్ అనేది ఐసిస్, లష్కరేతోయిబా, జైష్‌ఏహింద్ వంటి ఉగ్రవాద సంస్థల కంటే భయంకరమైన ఉగ్రవాద సంస్థ... భారతదేశ సంస్కృతిలో ఆడవాళ్లను గౌరవించే విధానమే లేదు. ఆడవాళ్లను గౌరవించే సంస్కారమే అక్కడి పురుషులలో లేదు. భారతదేశంలో ప్రజాసంక్షేమ పాలన కావాలంటే మళ్లీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రావాలి...

జర్మనీ తర్వాత జపాన్, ఇంగ్లాండ్, ఇటలీ, దుబాయ్, సింగపూర్‌లలోనూ రాహుల్ స్పీచ్ ఇలాగే సాగింది. స్క్రీన్ మీద రాహుల్ స్పీచ్‌ల సీన్‌లు ముగిసాక సోనియా వుండి... ఏంట్రా రాహుల్... నేను చెప్పిందేమిటి, నువ్వు చేసిందేమిటి అని అడిగింది. అందుకు రాహుల్... కాంగ్రెస్ జాతీయ పార్టీ... అది ప్రాంతీయ పార్టీ స్థాయికి పడిపోయిందని నువ్వు బాధపడ్డావు కదమ్మా... అందుకే కాంగ్రెస్ ప్రాంతీయపార్టీ కాదు, జాతీయ పార్టీ కూడా కాదు... అంతర్జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ప్రపంచ దేశాలలో గుర్తింపు తెచ్చేందుకే వివిధ దేశాలలో పర్యటించాను మమ్మీ అని చెప్పాడు. సోనియా గాంధీ తలబాదుకుంటూ విదేశాలకు పోయి మోదీని తిడితే ఏమొస్తుందిరా, ఆ ఏదుపేదో ఇక్కడే ఏడవచ్చుగా, నిన్ను 'పప్పు' అనేది అందుకేగా అని అంది. అంతలో మల్లిఖార్జునఖర్గే వచ్చాడు. ఏం మేడమ్ అర్జంట్‌గా రమ్మన్నారు అని అడిగాడు. సోనియా వుండి... మన పప్పుగాడిని నమ్ముకుంటే కాంగ్రెస్‌పార్టీని గెలిపించేది లేదు, పాడు లేదు, కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలంటే ఏం చేయాలనేదానిపై ఎవరినన్నా సలహా అడుగు అని చెప్పింది! అందుకు ఖర్గే... ఇలాంటి ఐడియాలు ఇవ్వడానికి గతంలో మన పార్టీలోనే ఒక నాయకుడుండేవాడు, ఇప్పుడు లేడు అని చెప్పాడు. అతను ఎక్కడికి వెళ్లాడు అని సోనియా అడిగింది. దేవేంద్రుడి దగ్గరకు వెళ్లాడు మేడమ్ అని ఖర్గే చెప్పాడు. ఎప్పుడొస్తాడో కనుక్కోండి అని సోనియా అంది. ఆయన ఇక రాడు మేడమ్, మనమే ఆయన దగ్గరకు వెళ్లాలి అని ఖర్గే చెప్పాడు. టికెట్ ఫిక్స్ చేయండి, ఒక్కసారి వెళ్లొద్దాం అని సోనియా చెప్పింది. అక్కడకు పోవడమే కాని, రావడం వుండదు మేడమ్ అని ఖర్గే చెప్పాడు. వాట్ డూయూ మీన్... మీరు చెప్పేది ఎవరి గురించి అని సోనియా అడిగింది. ఇంకెవరు మేడమ్, స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66) గురించి... ఆయనే ఈ భూమ్మీద ఉండుంటే మనకిన్ని సమస్యలు వుండేవి కావు అని చెప్పాడు. మరి ఆయనను సంప్రదించడానికి అవకాశముందా అని సోనియా అడిగింది. ఇస్రో వాళ్లతో మాట్లాడి ఇంద్రలోకం నుండి శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసాను మేడమ్... ఇప్పుడే ఆయనను లైన్‌లోకి తీసుకుని మాట్లాడుతామని ఖర్గే చెప్పాడు. తర్వాత ఆయనే అందర్నీ తీసుకుని కంప్యూటర్ రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ ఒక పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయించాడు. ఖర్గే అప్పుడే ఇస్రో ఛైర్మన్‌తో మాట్లాడాడు. 009911 9849459590 అనే విశ్వవ్యాప్త నెంబర్‌కు డయల్ చేసారు.

నెంబర్ డయల్ కావడంతోటే స్క్రీన్ మీద ఇంద్రలోకం కనిపించసాగింది. వీళ్లు డయల్ చేసిన నెంబర్... 'అటు అమలాపురం.. ఇటు పెద్దాపురం.. మధ్య గోదావరి' అనే పాట ట్యూన్‌తో రింగ్ కాసాగింది. అవతల ఆనం వివేకా హలో అంటూ ఫోన్ ఎత్తాడు. నల్ల కళ్లద్దాలు, నల్ల టీషర్ట్, నల్ల ఫ్యాంటు, నల్ల జుట్టు... గ్లామర్ ఏ మాత్రం తగ్గలేదు సరికదా రోజూ రంభ, ఊర్వశి, తిలోత్తమలతో డ్యాన్స్ చేస్తున్నాడేమో... ఇంకొంచెం గ్లామర్‌గా, స్లిమ్‌గా తయారయ్యాడు. స్క్రీన్ మీద వివేకాను చూడగానే సోనియా... వివేకాజీ హౌఆర్‌యు అని అడిగింది. బాగున్నాను మేడమ్, మీరెలా వున్నారని వివేకా అడిగాడు. అలా పలకరింపులు అయ్యాక వివేకానే... ఏం మేడమ్ ఇంత రిస్క్ తీసుకుని నన్ను లైన్‌లోకి తెచ్చి మాట్లాడుతున్నారు, ఏంటి సమస్య అని అడిగాడు. అప్పుడు సోనియా, దేశంలో కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ దిగజారిపోతుంది. పార్టీలో ఒక్కరూ సరైన నాయకులు లేరు. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావాలి, దీనికేదైనా మార్గం చెప్పండి అని అడిగింది. అంతా విన్న వివేకా రెండు నిముషాలు ఆలోచించాడు. తర్వాత సోనియాతో... మేడమ్, మీరు అక్కడ కాంగ్రెస్‌కు సరైన నాయకులు లేరంటున్నారుగా, వుండాల్సినోళ్లంతా ఇక్కడే వున్నారు. నెహ్రూ, పటేల్, శాస్త్రి, ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ, మా పి.వి.నరసింహారావు, వై.యస్.రాజశేఖరరెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి... అబ్బా... ఒకరా, ఇద్దరా వేలకొద్ది కాంగ్రెస్ నాయకులు గట్టోళ్లంతా ఇక్కడే వున్నారు. నా మాట విని అక్కడ పార్టీని క్లోజ్ చేసి మీరంతా ఇక్కడకు వచ్చేయండి... ఇంద్రలోకాన్నే మనం ఆక్రమించేసేయవచ్చు... శాశ్వతంగా ఇక్కడ మన పార్టీనే అధికారంలో వుంచవచ్చు. ఏమంటారు మేడమ్ అని వివేకా స్క్రీన్‌లో నుండి చూసాడు. అప్పటికే సోనియాగాంధీ స్పృహతప్పి క్రింద పడిపోయి వుంది.

# తేట తెలుగులో..'శ్రీ మహాభారతము'




సంపాదకులు: డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డా॥ సూరం శ్రీనివాసులు

'తింటే గారెలు తినాలి.. వింటే భారతం వినాలి' అని తెలుగు సామెత. తెలుగువారికి గారెలంటే ఇష్టం. ఇతిహాసాలలో కూడా భారతమంటే ఇష్టం. కథా భాగం నచ్చడానికి భాషతో సంబంధం లేకపోయినా మహాభారతం సంస్కృతంలో వ్యాసమహర్షి విరచితం. దాన్ని తెలుగు కావ్యంగా మలుచుకోవడానికి తెలుగు వారికి దాదాపు మూడు శతాబ్దాలు పట్టింది. నన్నయ ప్రారంభించిన అనువాదం అరణ్యపర్వం మధ్యలో ఆగిపోయింది. తిక్కన విరాటపర్వంతో ప్రారంభించి 15 పర్వాలు పూర్తిచేశారు. అరణ్య పర్వం శేషం ఎర్రన పూర్తిచేశారు. ఈ అనువాదంలో సింహభాగం తిక్కనదే.

వ్యాసభారతాన్ని తెలుగులోనికి వచనానువాదంతో తెచ్చేందుకు కొందరు ప్రయత్నించారు. కొన్ని కొన్ని భాగాలు ప్రచురింప గలిగారు. కానీ, ఇప్పుడు వ్యాస భారతం మొత్తం తెలుగు వచనానువాదంతో, సంస్కృత భారత వ్యాఖ్యానాలలోని విశేషాలతో (అవసరమైన చోట్ల) తెలుగు భారతంతో తులనాత్మక పరిశీలనతో కూడా ఏడు సంపుటాలుగా వెలువడుతుండడం ఎంతో విశేషం. అందులోనూ ఏ-4 సైజులో అన్ని సంపుటాలను కలుపుకుని 7,250పుటలతో విస్తృత గ్రంథ రూపాన్ని పొందింది. గోరఖ్‌పూర్‌లోని గీతాప్రెస్ ఈ బృహత్తర కార్యాన్ని చేపట్టి అందరి ప్రశంసలు అందుకుంటోంది.

ప్రఖ్యాత పండితులు డా. తిప్పాభట్ల రామకృష్ణమూర్తి, డా. సూరం శ్రీనివాసులు ఈ ఇరువురి సంపాదకత్వంలో, ఇతర పండితుల సహకారంతో వెలువడిన గ్రంథమిది. ఆది, సభా పర్వాలతో కూడిన మొదటి సంపుటం తాజాగా ఇప్పుడు పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. ఈ మహాభారతాన్ని తేట తెలుగు వచనానువాదంతో తెలుగు ప్రజలకు అందించడానికి ఈ పండితులు చేస్తున్న కృషి అమూల్యం అపూర్వం కూడా. ఇక గోరఖ్‌పూర్ గీతా ప్రెస్ వారి కృషి అనితర సాధ్యమనే చెప్పాలి. మహాభారతం పద్యరూపంలోకి రావడానికి మన నెల్లూరువారైన తిక్కన ప్రమేయమున్నట్లే, వచన రూపంలోకి రావడానికి కూడా నెల్లూరి వారి ప్రమేయం ఉండడం ఎంతైనా విశేషమే అనుకోవచ్చు. బహుశా ఇది యాదృచ్ఛికమే కావచ్చు. ప్రముఖ సారస్వతవేత్త డా. సూరం శ్రీనివాసులు నెల్లూరి వారు కావడం, ఇక్కడి పాఠశాలల్లో, కళాశాలల్లోనే విద్యాభ్యాసం చేసిన వారు కూడా కావడం, ఇంతటి





**శ్రీ మహాభారతము**
ఆది సభా పర్వాలు
వెల: రూ.400/-
ప్రతులకు :
గీతాప్రెస్ గోరఖ్‌పూర్ పుస్తక దుకాణం
41, 4-4-1, దిల్‌షాద్ ప్లాజా,
సుల్తాన్ బజార్, హైదరాబాద్ - 95.

బృహత్తర కార్యంలో నెల్లూరీయులకు సముచిత స్థానం దక్కడం నెల్లూరుకు గర్వకారణం.

ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక గ్రంథాల ముద్రణలో ఎంతో పేరుగాంచిన గోరఖ్‌పూర్‌వారి గీతా ప్రెస్ సంస్థ త్వరలో ఈ మహాభారతం మొత్తాన్ని తెలుగు భాషలో అందుబాటులోకి తీసుకురానుంది. లక్ష శ్లోకాలు గల 18 పర్వాల మహాభారతాన్ని 7 సంపుటాలుగా వెలుగులోకి తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషిచేస్తోంది. అన్ని సంపుటాలను కలుపుకొని ఒక మహాగ్రంథంగా వెలుగులోకి తీసుకురానుంది. అత్యంత శ్రమతో శ్లోక తాత్పర్యములే కాక, నీలకంఠీయ వ్యాఖ్యాన విశేషాలను కూడా దీనిలో జతచేయడం విశేషం. సందర్భానుసారంగా కవిత్రయ విరచితమైన తెలుగుభారతంలోని పద్యాలను జోడించడం ద్వారా పద్యాలను ఇష్టపడేవారికి మరింత ఉపయుక్తంగా ఉండబోతున్నదీ మహాభారత గ్రంథం. విడివిడిగా ఒక్కొక్క భాగానికి 400 చొప్పున, 7 సంపుటాలకు 2800 రూపాయలుగా వెలను నిర్ణయించారు. 102 పుటలున్న ఆది, సభా పర్వాలతో కూడిన మొదటి సంపుటంలో 29 పర్వాలుంటాయి. సంస్కృత భారతంలో ప్రధానపర్వాలు 18 అయినా, అది 100 ఉప పర్వాలుగా విభజింపబడింది. ఆదిపర్వంలో 19 పర్వాలు, సభాపర్వంలో 10పర్వాలు ఉంటాయి. మొత్తం పద్య గద్య సంఖ్య 12,919(అధిక పాఠాలతో కలిపి).

**సర్వేషాం కవి ముఖ్యానా**
**ముప జీవ్యో భవిష్యతి!**
**పర్జన్య ఇవ భూతానామ్**
**అక్షయో భారతద్రుమ:!!**..(ఆది-1-92).

'ప్రాణులన్నిటికీ మేఘం జీవనప్రదాత. అలాగే మహాకవులందరికీ ఈ భారత మహావృక్షం ప్రధానాశ్రయం అవుతుంది'. ఇది అనువాదం. వెంటనే తెలుగు భారతంలో అదే భావాన్ని విస్తరించి నన్నయ్య వ్రాసిన పద్యాన్ని కూడా అందిస్తారు రచయితలు. కవితాభిమానులు, ఇతిహాసాభిమానులు, ధర్మ జిజ్ఞాసువులు తప్పక సమీకరించుకోవాల్సిన సంపుటాలివి. 1072 పుటల ఆది- సభాపర్వాల సంపుటి వెల 400 రూపాయలు మాత్రమే.



**కోట రాజశేఖర అవధాని**
నెల్లూరు.

# కళ్యాణ వైభవం...!

## లక్ష్మీ సాయిప్రియ - శ్రీనివాసతేజ



వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ - సింధుల కుమార్తె **లక్ష్మీ సాయిప్రియ - శ్రీనివాసతేజ** (ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ - కోమలిల కుమారుడు)ల కళ్యాణం ఆగస్టు 30వ తేదీ చెన్నైలోని శ్రీరామచంద్రా కన్వెన్షన్‌హాల్‌లోను, రిసెప్షన్ సెప్టెంబర్ 2వ తేదీ వెంకటగిరిలోను ఘనంగా జరిగాయి. వేలసంఖ్యలో ఆప్తులు, అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ పక్షాల రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాల ముఖ్యులు ఈ వేడుకలకు హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## ప్రవీణ్‌కుమార్ - రాజశ్రీ



కేంద్రఫిలిం సెన్సార్ బోర్డు మాజీసభ్యులు బడబాగ్ని ఆంజనేయరాజు - లక్ష్మీదేవిల కుమారుడు **ప్రవీణ్‌కుమార్ - రాజశ్రీ** (విజయవాడ వాస్తవ్యులు కాసుల సుబ్బరాజు - కమలల కుమార్తె)ల పెళ్లి ఆగస్టు 29వ తేదీ విజయవాడలోని సంస్కృతి ఫంక్షన్ హాల్ నందు జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



సింహాద్రి కన్‌స్ట్రక్షన్స్ అధినేత వెలం శ్రీనివాసులు - భారతిల కుమారుడు **సుజిత్(సింహాద్రి) - అనుగ్రహ** (తమిళనాడు తిరువళ్ళూరుజిల్లా, మంజకారణి గ్రామ వాస్తవ్యులు కూరపాటి శంకర్ - భారతిల కుమార్తె)ల వివాహం ఆగస్టు 30వ తేదీ చెన్నైలోని రామలక్ష్మి ప్యారడైజ్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

# నెల్లూరు ఇస్కాన్‌లో...

# వైభవంగా శ్రీకృష్ణాష్టమి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ ప్రత్యేక అధికారి పెంచల్‌రెడ్డి, రవాణా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి



అభిషేక సేవలో పాల్గొన్న బీద మస్తాన్‌రావు



చిన్నికృష్ణుని ఊంజల్ సేవలో పాల్గొన్న తుంగా శివప్రభాత్‌రెడ్డి దంపతులు

నెల్లూరు ఇస్కాన్‌సిటిలోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ నెల 3న రాధాకృష్ణుల అభిషేక మహోత్సవాన్ని ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిరంలో బాలకృష్ణుడి ఊంజల్ సేవ వేడుకగా జరిగింది. జగన్నాధుడికి పూలంగిసేవను కనులపండువగా నిర్వహించారు. ప్రతియేట లాగే వార్షిక ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. బాలబాలికలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అర్ధరాత్రి 12గంటలకు కృష్ణ పరమాత్ముడికి మహాహారతి అనంతరం 108 వంటకాలతో నివేదన జరిగింది. మంత్రి ఓఎస్‌డి సిహెచ్.పెంచల్‌రెడ్డి దంపతులు, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి దంపతులు, రవాణా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కావలి మార్కెటింగ్ కమిటి మాజీఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్ దంపతులు తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. 4వ తేదీ జరిగిన కార్యక్రమాల్లో ఇస్కాన్ సంస్థాపకుడు శ్రీల భక్తివేదాంతస్వామి ప్రభుపాద 122వ వ్యాసపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఇడుపులపాయలో విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ

# నారాయణరెడ్డి



దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 2వ తేదీన విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ఆచార్య వి.నారాయణరెడ్డి వై.యస్.ఆర్.జిల్లా ఇడుపులపాయలోని వై.యస్. సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వై.యస్. చేసిన సేవలను ప్రస్తుతించారు. వై.యస్. హయాంలోనే నెల్లూరుజిల్లాకు విక్రమ సింహపురి విద్యాలయం మంజూరైందని, ఆ యూనివర్శిటీకి వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. వై.యస్.ఆర్ ఆశయాలే లక్ష్యంగా ఆయన చూపిన సేవా మార్గమే స్ఫూర్తిగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు స్థాపించిన విపిఆర్ ఫౌండేషన్ పని చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

# శ్రీహరి ధార్మిక సేవలు అమూల్యం



శ్రీహరిని సత్కరిస్తున్న దువ్వూరు రాధాకృష్ణారెడ్డి

టిటిడి ధర్మప్రచార పరిషత్ నెల్లూరుశాఖ కోఆర్డినేటర్‌గా 34 ఏళ్ళపాటు పనిచేసి, కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిపట్ల జిల్లా వ్యాప్తంగా భక్తితత్వాన్ని మరింతగా పరివ్యాప్తం చేసిన మల్లెల శ్రీహరి ధార్మికసేవలు ఎంతో అమూల్యమైనవని వక్తలు కొనియాడారు. గతనెల 31న శ్రీహరి ఉద్యోగ విరమణ సందర్భంగా నెల్లూరులోని టిటిడి కల్యాణ మండపం ప్రాంగణంలో పదవీ విరమణ సన్మానసభ ఏర్పాటుచేశారు. మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షత్వంలో జరిగిన ఈ సభలో బీజెపి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య, టిటిడి కల్యాణ మండపం మేనేజర్ రాంగోపాల్, పురాణపండితుడు దేవరాజులు ముఖ్యఅతిథులుగా పాల్గొని సుదీర్ఘకాలంగా జిల్లాలో ధర్మ ప్రచారానికి శ్రీహరి చేసిన సేవలను ప్రస్తుతించారు. ఆయన సేవలు అందరికీ మార్గదర్శకమన్నారు. అనం తరం, శ్రీహరి దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శ్రీహరి మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం శేషజీవితాన్ని తాను భగవద్భక్తి ప్రచారానికే అంకితం చేస్తానన్నారు. కాగా, నిరంతరం హిందూ ధర్మ ప్రచారానికి కృషిచేస్తున్న శ్రీహరిని స్థానిక శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మహోత్సవ సేవాసమితి గౌరవ సలహాదారుగా స్వీకరిస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజేశారు. ముఖ్య అతిథులు, జిల్లావ్యాప్తంగా విచ్చేసిన భజన సంఘాల వారు, కళాకారులు, సంగీతజ్ఞులతో పాటు సమాజ సేవకులు వెంకటస్వామి, అవధాని కోట రాజశేఖర్, సాహితీవేత్త కరిమద్దెల నరసింహారెడ్డి, కవులు గంగిశెట్టి శివకుమార్, మద్దూరు శ్రీనివాసులు, బొగ్గరపు రాధాకృష్ణ తదితరులు శ్రీహరిని ఘనంగా సత్కరించారు. తొలుత, ప్రముఖ గాయకుడు వివిఎస్ వినోద్ గానం చేసిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ భక్తిభావసమన్వితులను చేశాయి.

# ముదివర్తి కొండమాచార్యులకు సన్మానం



సర్వేపల్లి రాధాకృష్ణన్ 130వ జయంతి మరియు గురుపూజోత్సవం సందర్భంగా ఈ నెల 5న విశ్రాంత ఉపాధ్యాయుడు, కవిశేఖర బిరుదాంకితులైన శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులును ఘనంగా సత్కరించారు. ఏపి డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. పంచాయతిరాజ్ ఇ.ఇ కాంతారావు, శ్రీనివాసులురెడ్డి, బ్రాహ్మణసేవా సంఘం గౌరవాధ్యక్షుడు, ఆడిటర్ కంటి రామ్మోహన్‌రావు, చంద్రహాస్, లయన్స్ ప్రతినిధులు రామ్మోహన్, ఎస్‌విఎల్ ప్రసాద్, మహబూబ్‌బాషా, ఎస్. చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ యాక్షన్

(మొదటి పేజీ తరువాయి)

తన జట్టులో వుంటే ఎక్కువ సేపు ఆడే అవకాశం అతనికే కల్పిస్తాడు. లేదా బయట జట్లలో ఎవరన్నా మెరుగైన ఆటగాడున్నాడని తెలిస్తే ప్యాకేజీ ఎరవేసి ఆ ఆటగాడిని తన జట్టులోకి తెచ్చుకుంటాడు. ఎవరు ఆడారు, ఎవరు ఎన్ని గోల్స్ వేసారు అన్నది ఆయనకు ముఖ్యం కాదు... ఆటలో గెలిచామా లేదా అన్నదే ఆయనకు ప్రధానం. ఎందుకంటే తన జట్టు గెలిస్తే పేరొచ్చేది ఆయనకే! పదవొచ్చేదీ ఆయనకే కదా!

ప్రతిపక్షంలో వున్న వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు ఇంకా పాదయాత్రలు చేసుకునే పనిలోనే వున్నారు. సభలకు వస్తున్న జనాన్ని చూసి చంకలు గుద్దుకునే పనిలో వున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత, చంద్రబాబు పరివారం అవినీతి అక్రమాలు, టీడీపీ నుండి జనసేన విడిపోవడం, ఈసారి బీజేపీతో టీడీపీ పొత్తు లేకపోవడం, కాపుల రిజర్వేషన్ల వివాదం, బ్రాహ్మణ సంఘాల గొడవలు, అమలు కాని ఋణమాఫీ, ఆచరణలో సాధ్యం కాని భ్రమరావతి... ఇవన్నీ తమకు ప్లస్ పాయింట్లని వైకాపా నాయకులు భావిస్తున్నట్లుగా వుంది.

అయితే ఇవన్నీ తమకు ప్లస్లని వైసిపి నాయకులు ఎంతగా ఆశపడుతున్నారో, ఇవన్నీ తనకు మైనస్లని తెలుసుకోలేనంత అమాయకుడు కాదు చంద్రబాబు. ఆ వైఫల్యాలను కప్పిపుచ్చి, వాటికి మసిపూసి మారేడుకాయలు చేసే తెలివితేటలు ఆయనకు లేకపోలేదు.

వైకాపా నాయకులు ఇంకా ఎన్నికల మూడ్లోకి రాలేదు. అంతా జగన్ పాదయాత్ర ఎప్పుడు పూర్తవుతుందా? ఎన్నికల ప్రణాళికపై జగన్ తమతో ఎప్పుడు చర్చిస్తాడా అని ఎదురుచూస్తున్నారు. కాని చంద్రబాబు మాత్రం కొన్ని నెలల క్రితమే ఎన్నికల యాక్షన్ మొదలుపెట్టాడు. ఒక రకంగా ఆయన 2014లో సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన మరుసటి క్షణం నుండే 2019లో జరగబోయే ఎన్నికల ప్లాన్ గురించి ఆలోచిస్తుంటాడు. ఎన్డీఏ నుండి బయటకు రావడం, జనసేన అధినేత పవన్కళ్యాణ్ చేత విడిగా పోటీ చేయించాలనుకోవడం ఆయన ఎన్నికల యాక్షన్లో భాగమే! మేధావి ముసుగులో జె.డి లక్ష్మీనారాయణను తిప్పుతున్నది ఆయనే! సీపీఎం, సిపిఐలను వైసిపితో కలవకుండా జనసేనకు చేరువచేసింది ఆయనే! ఎన్టీఆర్ ఆత్మ క్షోభించేలా కాంగ్రెస్తో సైతం పొత్తుకు సిద్ధమవుతున్నది కూడా ఎన్నికల ప్రణాళికలో ఒక వ్యూహమే!

నాలుగేళ్ళ దాకా అన్నక్యాంటీన్ల ఊసే లేదు. ఎన్నికలు సమీపిస్తున్నాయనే సరికి రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు వెలిసాయి. అన్న క్యాంటీన్లో అన్నం తిన్న ప్రతోడు తనపై విశ్వాసం చూపిస్తాడన్నది చంద్రబాబు నమ్మకం. ఎన్నికలు దగ్గరకొచ్చే సరికి చంద్రబాబుకు నిరుద్యోగభృతి గుర్తుకు వచ్చింది. ఇటీవలే నిరుద్యోగ భృతి ప్రకటించడం తెలిసిందే! ఇక పింఛన్లు పెంచి వృద్ధులకు ఓట్ల వల విసరబోతున్నాడు.

2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశంకు, అధికారం మిస్సయిన వైకాపాకు తేడా 5లక్షల ఓట్లే! 2014లో తమకు పడ్డ ఓట్లన్నీ ఇప్పటికీ తమ వెంటే వున్నాయని జగన్ నమ్మకం! జనసేన అయినా బీజేపీ అయినా తెలుగుదేశం ఓట్లనే చీలుస్తాయి. ఇక గతంలో టీడీపీకే ఓట్లేసిన కాపులు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, బలహీనవర్గాలలో కొంత ఓటు బ్యాంకు తమ వైపు రావచ్చని వైసిపి శ్రేణుల నమ్మకం. అయితే అంత అతివిశ్వాసం పనికిరాదు. 2014లో తనకు పడ్డ ఓట్లలో కొంత శాతం ఓటింగ్ పక్కకుపోతుందని చంద్రబాబుకు తెలుసు. ఆ లోటును పూడ్చుకోవడానికి ఆయన వైసిపి ఓటు బ్యాంకుకు టెండర్ పెట్టాడు. రాష్ట్రంలో క్రిస్టియన్లు, ముస్లింలు వైసిపికి బలమైన ఓటు బ్యాంక్! 2014 ఎన్నికల్లో వీరిలో 80శాతం ఓట్లు వైసిపికే పడ్డాయి. ప్రత్యేకహోదా సాకు చెప్పి బీజేపీతో తెగదెంపులు చేసుకున్నామని చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా బాగానే ప్రచారం చేయించుకున్నాడు. మైనార్టీల ఓట్ల కోసం ప్రత్యేక తాయిలాలు ఎరవేయబోతున్నాడు. 'నారా హమారా - టిడిపి హమారా' అంటూ గుంటూరులో ముస్లింలతో సదస్సు నిర్వహించడం మైనార్టీ ఓట్ల దోపిడీకి సంకేతం! అలాగే క్రిస్టియన్ ఓట్లకు టెండర్ పెట్టడానికి స్కెచ్ వేస్తున్నాడు. ఈ రెండు ఓటు బ్యాంకులను చంద్రబాబు ఏ మాత్రం కదిలించ గలిగినా వైసిపికి తీరని నష్టం ఖాయం. కులాల వారీగా, మతాల వారీగా ఓట్ల వేటలో చంద్రబాబు ఆటను ప్రారంభించాడు. వైసిపి శ్రేణులు వెంటనే అలర్టై ఆయనకు ధీటుగా ఎలక్షన్ గేమ్ ప్లాన్ చేయగలిగితేనే జగన్ అధికారం 'ఆశ'యం నెరవేరగలదు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లా అధికారి కె.గీత అన్నారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల4న బుజబుజ నెల్లూరులో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. శ్రీనివాస ఇం.మీ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు కె.మురళీ మోహన్రాజు, కరెస్పాండెంట్ ఎన్వి సుబ్బయ్య, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

# నెగ్గితే నారా.. తగ్గితే తార

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కోరిక నెరవేరాలంటే 2019 ఎన్నికల్లో నెగ్గాలి. తాను యాక్టివ్గా వున్నప్పుడే లోకేష్ను సీఎంను చేయాలి. తన శిక్షణలో లోకేష్ను రాటుదేలేలా తీర్చిదిద్దాలి. పార్టీపై లోకేష్ పట్టు బిగించేలా చూడాలి. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం తిరిగి అధికారంలోకి వస్తే చంద్రబాబు ఆలోచనకు తగ్గట్లే అన్నీ జరిగిపోతాయి. లోకేష్ను ఎలాగోలా సీఎం కుర్చీలో కూర్చోబెడితే అతని తంటాలు అతను పడతాడు. పార్టీ కూడా చేతుల్లో నుండి జారకుండా వుంటుంది. అలాకాకుండా తెలుగుదేశం ఓడిపోతే... సీన్ పూర్తిగా మారొచ్చు. పార్టీపై చంద్రబాబు పట్టు సడలిపోతుంది. ఇప్పటికే పార్టీపై చంద్రబాబు పట్టు కొంత సడలింది. గతంలో చంద్రబాబు ముందు కుక్కిన పేనుల్లా వుండే నాయకులు గత నాలుగేళ్ళుగా ఆయన ముందే తోకాడిస్తున్నారు. చంద్రబాబు పరిస్థితి కూడా వారి మీద ఆధారపడక తప్పడం లేదు. రేపు పార్టీ ఓడిపోతే చంద్రబాబు ప్రాబల్యం తగ్గిపోతుంది. పార్టీని నిలబెట్టాలంటే లోకేష్ సరిపోడని, నందమూరి వారసులు కావాలనే డిమాండ్ పార్టీ కార్యకర్తల్లోనే రావచ్చు. ఈ కోణంలో చూస్తే ఇప్పుడు నందమూరి కుటుంబసభ్యుల్లో క్రేజ్ వుండేది జూనియర్ ఎన్టీఆర్(తారక్)కే! పెద్ద ఎన్టీఆర్ ఇమేజ్ వుండేది కూడా జూనియర్ ఎన్టీఆర్కే! నందమూరి కుటుంబంలో ఇంకెవరివల్ల కూడా పార్టీ నిలబడే పరిస్థితి లేదు. లోకేష్కు అడ్డొస్తాడని చెప్పే చంద్రబాబు వ్యూహాత్మకంగా జూనియర్ను తొక్కిపెడుతూ వచ్చాడు. 2009లో జూనియర్ ఎన్టీఆర్ను ప్రచారానికి వాడుకున్న చంద్రబాబు 2014 ఎన్నికల్లో మాత్రం దగ్గరకు రానీయలేదు. ఎందుకంటే లోకేష్ రాజకీయ ప్రయాణం అక్కడనుండే మొదలైంది. జూనియర్ను సీన్లోకి తెస్తే లోకేష్ ఫోకస్ కాలేడనే భయం. అందుకే జూనియర్ను పార్టీకి దూరం పెట్టారు.

2019 ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోతే జూనియర్ నాయకత్వం కావాలని పార్టీలోనే డిమాండ్ రావచ్చు. అయితే ఇక్కడా చంద్రబాబు ప్రత్యామ్నాయం ఆలోచించి పెట్టాడని తెలుస్తోంది. నందమూరి కుటుంబం నుండే నాయకత్వం కావాలని పార్టీ శ్రేణులు కోరుకుంటే జూనియర్కు పోటీగా తన కోడలు, ఎన్టీఆర్ మనుమరాలు నారా బ్రాహ్మిణి ఆయన తెరమీదకు తెచ్చే అవకాశాలు లేకపోలేదు. మొత్తానికి 2019 ఎన్నికలు నారా, నందమూరి కుటుంబాలలో వినూత్న రాజకీయ మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయి.

## కేరళ బాధితులకు సాయం

కేరళ బాధితుల సహాయార్థం కోవూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు 11,600 రూపాయలు విరాళాలు సేకరించి ఈ నెల1న తహశీల్దార్ కృష్ణారావుకు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహామూర్తి, ఉపాధ్యాయురాలు దేవిక పాల్గొన్నారు.

# ప్రాయశ్చిత్తమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకంటే ఒకే పార్టీలో వున్నప్పటికీ వారికి వై.యస్.తో పడేది కాదు. కాని వై.యస్. కుటుంబాన్ని ఆనం సోదరులు విమర్శించడం... అది కూడా అట్లా ఇట్లా కాదు... జగన్ను ఉరితీయాలి, జగన్ లాంటి కొడుకు ఎవరికీ ఉండకూడదు... ఈ కొడుకును జయమ్మ ఎలా పెంచిందో... వంటి ఘాటు మాటలతో విమర్శించడమే చరిత్రలో మాయని మచ్చ. రాజకీయంగా పడకుంటే జగన్తో విభేదించవచ్చు, ఇంకో పార్టీలో వుండొచ్చు. కాని ఈరోజు ఎంత సరిదిద్దుకోవాలనుకున్నా ఆనాడు మాట్లాడిన మాటలను చరిత్ర రికార్డుల నుండి తుడిపేయగలరా?

ఎందుకంటే వై.యస్.తో ఆనం సోదరులకున్న అనుబంధం అటువంటిది. వాళ్ళ మధ్య రాజకీయ సంబంధాలే కాదు స్నేహ సంబంధాలు అంతగా బలపడ్డాయి. రాష్ట్రంలో ఆనం సోదరులను అత్యంత ఎక్కువగా నమ్మాడు వై.యస్. పదవులకతీతంగా వాళ్ళ మధ్య బంధం కొనసాగింది. అలాంటి వై.యస్. కుటుంబం పట్ల చాలా అమర్యాదగా ప్రవర్తించారు ఆనం సోదరులు. ఆ కుటుంబంపై అనరాని మాటలన్నారు. చేసిన తప్పుకు ప్రాయశ్చితమో, జరిగిన పొరపాటును సరిదిద్దుకోవడమో... మొత్తానికి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 2వ తేదీన విశాఖ జిల్లాలో జగన్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్పార్టీలో చేరాడు. రామనారాయణరెడ్డి పార్టీ మారుతాడని గత 4 నెలలుగా కొనసాగుతున్న ఊహాగానాలకు ఎట్టకేలకు తెరదించారు. ఇక నెల్లూరుజిల్లా వైసిపిలో ఆయన పాత్ర ఏంటి? ఎక్కడ నుండి పోటీ చేస్తాడు? ఆయన వల్ల పార్టీకి ఎంతవరకు లాభం? అన్నది భవిష్యత్ తేల్చాలి!

## ఆనం చేరిక.. మేకపాటి కినుక...

ఆనం రామనారాయణరెడ్డి అడుగు పెట్టడంతోటే నెల్లూరుజిల్లా వైసిపిలో అలజడి మొదలైంది. ప్రశాంతంగా వున్న సరస్సులో రాయి వేసినట్లుగా పార్టీలో అలకలు, కలతలు మొదలయ్యాయి. ఆనం రామనారాయణరెడ్డి పార్టీలో చేరే కార్యక్రమానికి మేకపాటి కుటుంబం దూరంగా ఉండిపోయింది. ఆనం రాకతో వారిలో ఒకరికి సీటు పోతుందనే ప్రమాదం కూడా దీనికి కారణం. అలాగే ఆనం వస్తే తమ ఆధిపత్యం దెబ్బతింటుందనే అనుమానం కూడా వారిలో వుంది. కాబట్టే ఆనం రావడం వారికిష్టం లేదు. మరోపక్క వెంకటగిరికి నాలుగున్నరేళ్ళ నుండి ఇన్ఛార్జ్గా వ్యవహరిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కూడా ఆనంను పార్టీలోకి తీసుకోవడం పట్ల కినుకవహించాడు. వెంకటగిరి సీటుపై ఆయన ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నాడు. ఇప్పుడు ఆనం రూపంలో ఆయన సీటుకు ఎసరొచ్చేటట్లుండడంతో ఆయన అసంతృప్తికి లోనవుతున్నాడు. ఆనం అలా పార్టీలో అడుగుపెట్టాడో లేదో ఎప్పుడూ లేని విధంగా జిల్లా వైసిపిలో ఒక్కసారిగా అలకలు, అసంతృప్తులు బయటపడ్డం ఆందోళన కలిగించే విషయమే! జిల్లాలో ఆనం వల్ల పార్టీకి మేలు జరిగే మాటేమోగాని ఈ రూపంలో నష్టం జరిగేటట్లుండడం వైసిపి శ్రేణులను కలవరపరుస్తోంది!

## సోషల్ మీడియాలో సెటైర్లు

విశాఖలో ఆనం రామనారాయణరెడ్డి అలా వైసిపిలో చేరాడో లేదో సోషల్ మీడియాలో సెటైర్లు హల్చల్ చేసాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా వున్నప్పుడు జగన్ను ఉరితీయాలి అంటూ ఆయన ఇచ్చిన స్టేట్మెంట్లతో వచ్చిన పత్రికల క్లిప్పింగ్లు సోషల్ మీడియాలో వీరవిహారం చేసాయి. కొందరైతే వైసిపిలో చేరడానికి ఆనంకు సిగ్గు లేకపోయినా చేర్చుకోవడానికి జగన్కు సిగ్గు లేదా అంటూ కామెంట్లు పెట్టడం కొసమెరుపు. ఇలా పోస్టులు పెట్టినవాళ్ళలో టీడీపీ వాళ్ళకంటే వైసిపి అభిమానులే ఎక్కువగా వుండడం ఇంకో ప్రధానాంశం!

# మళ్ళీ కలిసాయి

(5వ పేజీ తరువాయి)

కాకాణికి సీటు లేకుండా పోయింది. తనకు ఆశ పెట్టి చివరికి సీటు లేకుండా చేసారనే కోపంతో కాకాణి ఆనంతో విభేదించాడు. అప్పటి నుండి ఎడమొగం, పెడమొగం అయ్యారు. అంతేకాదు, రాజకీయ దారులు కూడా వేరయ్యాయి. కాకాణి ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ను వీడి జగన్ నాయకత్వంలోని వైసిపిలో చేరితే, ఆనం రామనారాయణరెడ్డి మాత్రం 2014 ఎన్నికల దాకా కాంగ్రెస్లో కొనసాగి 2015 జనవరిలో తెలుగుదేశంలో చేరాడు. 2009 నుండి 2018 సగం దాకా దాదాపు 9ఏళ్ళు ఆనం, కాకాణిల మధ్య వైరం ఏర్పడింది.

తాజాగా పరిస్థితి మారింది. కాకాణి వుంటున్న పార్టీలోనే ఆనం వచ్చి చేరాడు. దీంతో విభేదాలు పక్కనపెట్టేసారు. మునుపటిలాగే ఒకరితో ఒకరు కలిసిపోయారు. ఒకప్పుడు ఆనం సోదరుల ఆధ్వర్యంలో కాకాణి కాంగ్రెస్లో రాజకీయ ప్రయాణం మొదలుపెట్టాడు. ఇప్పుడు వైకాపాలో కాకాణి సీనియర్ నాయకుడు. ఆయన ఆధ్వర్యంలోనే ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరాడు. వీళ్ళిద్దరి మధ్య మునుపటి స్నేహం మళ్ళీ ముదిరినట్లే కనిపిస్తోంది. రాజకీయంగా ఒకరి అవసరం ఒకరికుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో ఆనంకు బలం, బంధుత్వం వుంది. కాకాణికి అది అవసరం. అలాగే కాకాణి పార్టీ జిల్లా అధ్యక్షుడు. ఆనం కొత్తగా పార్టీలో చేరాడు. కాబట్టి కాకాణితో స్నేహం ఆయనకు అవసరమే! మొత్తానికి 9ఏళ్ళ క్రితం వేర్వేరు దారులు పట్టిన ఇద్దరు కూడా మళ్ళీ ఒకే చోట కలిసారు.

# సర్దుబాటు

(5వ పేజీ తరువాయి)

ఆదాల లోక్సభ కంటే అసెంబ్లీ వైపే మొగ్గు చూపుతున్నాడని సమాచారం. నెల్లూరు రూరల్, కోవూరు అసెంబ్లీలు ఆయనకు ఛాయిస్లో వుండగా, ఆదాల కోవూరువైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆదాల అసెంబ్లీకి దిగితే మాత్రం ఆ అసెంబ్లీలో తప్పితే మిగతా నియోజకవర్గాలలో ఆదాల ప్రభావం ఏమంతగా వుండదు. ఆదాల లోక్సభకు రాకపోతే బీద మస్తాన్ రావును లోక్సభకు తీసుకు రావాల్సివుంది.

ఏదేమైనా ఆదాల ముందుగా డిసైడ్ కావాల్సింది తెలుగుదేశంలోనే వుంటాడా? వైసిపిలోకి పోతాడా? అని. టీడీపీలోనే వుంటే లోక్సభకా? అసెంబ్లీకా? అన్నది తేలిస్తే తెలుగుదేశంలో సీట్ల సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లే!

# అన్'హ్యాపీడేస్'

## ఆరు రోజులు అడుక్కుతిన్నా.. ఆదివారం తైతక్కలేనా..?






## చెత్తతో సందులు సండే చిందులు

తెలుగుదేశం ప్రభుత్వం వాస్తవిక పరిపాలనకంటే ఈవెంట్లకు అధిక ప్రాధాన్యతనివ్వడం చూస్తూనే వున్నాం. పది రూపాయల పనికి పాతిక రూపాయల పబ్లిసిటీ అన్నట్లుగా చంద్రబాబు పాలన సాగిపోతోంది. ఈ నాలుగేళ్ళ కాలంలో పథకాల అమలు కంటే ఈవెంట్లు ఎక్కువుగా జరగడం చూసాం. ఆఖరకు పుష్కరాల ఈవెంట్ షూటింగ్ టైంలోనే 23మంది తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం జరిగింది.

ఇలాంటి ఈవెంట్ల పరంపరలోనే 'హ్యాపీ సండే' అనే ఒక సంస్కృతిని తెచ్చిపెట్టారు. వారంలో ఆరు రోజులు అడుక్కుతిన్నా సరే ఆదివారం మాత్రం ఆడుతూ పాడుతూ ఎగిరిగంతులేయండనేది దీని ఉద్దేశ్యం. ప్రతి ఆదివారం ఏదో ఒక పార్కులో డిజెలు ఏర్పాటు చేస్తున్నారు. కాలేజీ కుర్రకారును పిలుస్తున్నారు. అధికారపార్టీ మంత్రులు, నాయకులు పాటలకు చిందులు వేస్తూ 'హ్యాపీ సండే' అంటూ హ్యాపీగా ఫీలవుతున్నారు. ప్రతి ఆదివారం కూడా నెల్లూరులో ఎక్కడో ఒకచోట ఈ హ్యాపీసండే పేరుతో పిల్లల చేత తైతక్కలాడిస్తున్నారు. ఈ కార్యక్రమాలు పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా వుంటుంది. పాశ్చాత్య దేశాలలో వీకెండ్ పార్టీలు, హ్యాపీ సండే వంటివి వుంటాయి. వాళ్ళకేందంటే ఐదురోజులు యంత్రాల్లాగా పని చేస్తారు. ఆ రెండురోజులు మనుషుల్లాగా జీవిస్తారు. కాబట్టి వాళ్ళకు అవి సెట్ అవుతాయి. మనమేమీ అంత యాంత్రిక జీవనం గడపడం లేదు. అసలు తీరికలేనంత పనులు కూడా ఏమీ ఉండడం లేదు. ప్రతి మనిషికి ఉపాధి దొరికి, ప్రతి రంగం ఉత్సాహంగా ముందుకు కదులుతుంటే మన జీవితాలలో 'హ్యాపీసండే' కాదు 'హ్యాపీడేస్' వస్తాయి.

నగరంలో 20రోజులకు పైగా పారిశుద్ధ్య కార్మికుల సమ్మె జరుగుతుంది. నగరంలో ఎక్కడిచెత్త అక్కడే వుంది. అసలే తవ్విన రోడ్లతో ప్రతి వీధిలో దుమ్ము మయం, దీనికితోడు ఇప్పుడు చెత్త... ప్రజలకు హ్యాపీ సండే కాదు, అన్‌హ్యాపీ డేస్ కొనసాగుతున్నాయి. పాలకులు, అధికారులు హ్యాపీ సండేలపై చూపిన శ్రద్ధ, పారిశుద్ధ్య పనులపై చూపిస్తే ప్రజలకు ప్రతిరోజూ హ్యాపీడేనే అవుతుంది.

# మరపురాని మహానేత డా. వైఎస్






దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా దూరమైనా, ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని, ఆయన మరపురాని మహానేత అని వక్తలు పేర్కొన్నారు. ఈ నెల 2న డా.వైఎస్ 9వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆ మహానేతను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. డా.వైఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఏనాటికీ మరచిపోలేనివని, డా.వైఎస్ ఆశయసాధనకు అందరం కలసి కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ నేతృత్వంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 500 మందికి, పేదలకు అన్నదానం చేశారు. బిసి సెల్ ఇన్‌ఛార్జి ఎన్.సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నదాన కార్యక్రమంలో నాయకులు తాటి వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, నెల్లూరు పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, జి.నరేష్, డాక్టర్ సత్తార్, హజరత్‌నాయుడు, మేఘనాధసింగ్, చిన్నమస్తాన్, చేజర్ల మహేష్, మొయిళ్ళ సురేష్, రాజారెడ్డి, రియాజ్, సందానీబాషా తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్సీపి జిల్లా కార్యాలయంలో జడ్పీటిసి సభ్యులు, నేతల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో వై.యస్. విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు.

# వైసిపిలోకి రామ్

## జగన్ సమక్షంలో 8న పార్టీలో చేరిక



దివంగత మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, రాజకీయ వారసుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వైసిపిలో చేరడానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8వ తేదీన విశాఖపట్నం జిల్లాలో పార్టీ అధినేత జగన్ సమక్షంలో ఆయన వైసిపిలో చేరనున్నారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వైసిపిలో చేరే కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు నేదురుమల్లి అభిమానులు, అనుచరులతో మంతనాలు కూడా జరిపారు. నేదురుమల్లికి గట్టి పట్టున్న వాకాడు, కోట, చిల్లకూరు, చిట్టమూరు, వెంకటగిరి, ఓజిలి, గూడూరు, డక్కిలి, బాలాయపల్లి, సూళ్లూరుపేట, నెల్లూరుసిటి తదితర ప్రాంతాల నుండి భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేసారు. దాదాపు రెండువేలమంది కార్యకర్తలతో 7వ తేదీ మధ్యాహ్నం వాహనాలలో వాకాడు నుండి బయలుదేరనున్నారు. 8వ తేదీ పార్టీలో చేరుతారు. రాంకుమార్ ఇటీవలే ప్రజా సంకల్ప పాదయాత్రలో వున్న జగన్‌ను కలవడం, పార్టీలో చేరాలని ఆయన ఆహ్వానించడం తెలిసిందే! 2014 ఎన్నికల్లో వెంకటగిరి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాంకుమార్, ఆ తర్వాత బీజేపీలో చేరాడు. ఇటీవల కొత్తగా ప్రకటించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఆయనకు చోటు కల్పించినప్పటికీ ఆయన ఆ పదవిని తీసుకోలేదు. అప్పటికే వైసిపిలో చేరాలని నిర్ణయం తీసుకున్నాడు. రాంకుమార్ వైసిపిలో చేరితే వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలలో పార్టీకి ఊపు వచ్చినట్లే! వెంకటగిరి అసెంబ్లీకి వినపడుతున్న పేర్లలో రాంకుమార్ గట్టి అభ్యర్థి కాగలడు!



## సెలవులో కలెక్టర్

జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు 15రోజులు సెలవులో వున్నారు. ఇటీవల ఆయనకు రెండో బిడ్డ జన్మించడంతో లీవ్ పెట్టారు. ఈ నెల 16వ తేదీ మళ్ళీ విధులలో చేరతారు. అప్పటి వరకు జాయింట్ కలెక్టర్ వెట్రిసెల్వీ ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com